# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి: 12 సంచిక: 30 మంగళవారం 26-08-2025 పేజీలు: 08 వెల రూ. 3 www.epaperjournalistdiary.com


అనుష్క హోటల్ ముందు 1500 మంది పడిగాపులు కాసేవాళ్ళు !



8లో..

## ఉస్మానియా వర్సిటీని ఆక్స్‌ఫర్డ్ స్థాయిలో
# అభివృద్ధి చేస్తా



- ఓయూను కాలగర్భంలో కలపాలని చూశారు..
- తెలంగాణ పదానికి ప్రత్యామ్నాయం ఉస్మానియా యూనివర్సిటీ
- తెలంగాణ, ఉస్మానియా రెండూ అవిభక్త కవలల్లాంటివి
- 1938 సాయుధ రైతాంగ పోరాటానికి ఊపిరిలూదిన గడ్డ ఇది
- డ్రగ్స్, గంజాయి కల్చర్ వేగంగా విస్తరిస్తోంది
- ఓయూకు మళ్లీ వస్తా.. ఈసారి ఒక్క పోలీస్ ఉండొద్దు
- మరో 15 రోజుల్లో ఎమ్మెల్సీగా కోదండరాంను పంపుతాం



## ప్రధాని జైలుకెళ్లినా..
# రాజీనామా చేయాల్సిందే

- ప్రధాని, సీఎంలు 30 రోజులు జైల్లో ఉంటే పదవి కోల్పోతారని వెల్లడి
- ఈ నిబంధన మోదీకి కూడా వర్తిస్తుందని స్పష్టీకరణ
- జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపడం ప్రజాస్వామ్యానికి అవమానమన్న హోంమంత్రి
- ఇది రాజకీయ కుట్రేనంటూ ప్రతిపక్షాల తీవ్ర నిరసన



## 'కేసీఆర్‌ను కడియం శ్రీహరి
# బ్లాక్ మెయిల్ చేశారు

- కూతురి ఎంపీ చేయడం కోసమే కడియం పార్టీ మారారని రాజయ్య ఆరోపణ
- కడియం ఒక అవినీతి తిమింగలమంటూ ఘాటు వ్యాఖ్యలు
- విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు పోస్టులు అమ్ముకున్నారని విమర్శ
- విదేశాల్లో ఆస్తులు, బినామీ లావాదేవీలు ఉన్నాయని ఆరోపణలు
- స్పీకర్ వెంటనే కడియం అనర్హతపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్



## స్వదేశీ ఉద్యమానికి యువతే నాయకత్వం వహించాలి

- అహ్మదాబాద్‌లో సర్దార్‌ధామ్ బాలికల హాస్టల్‌కు వీడియో సందేశం ద్వారా శంకుస్థాపన
- స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రజలకు, యువతకు ప్రధాని మోదీ పిలుపు
- 'ఇక్కడ స్వదేశీ వస్తువులే అమ్ముతాం' అని బోర్డులు పెట్టాలని దుకాణదారులకు సూచన
- మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ప్రధాని మోదీ
- నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తున్నామని వెల్లడి



## అనంతగిరి రిసార్ట్స్ కి కొత్త రూపు..
### మంత్రి జూపల్లి ప్రత్యేక ప్లాన్ ఏంటి..?

- అనంతగిరి హరిత రిసార్ట్స్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా కలెక్టర్‌కి బాధ్యత
- ప్రైవేట్ రిసార్ట్స్‌కు ఏమాత్రం తీసిపోని ఆధునిక సౌకర్యాలు
- ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ ఆదాయ వనరులు పెరుగుదలపై నమ్మకం
- పర్వత సౌందర్యం పర్యాటకులను ఆకర్షిస్తుందన్న మంత్రి విశ్వాసం



## రేవంత్ రెడ్డితో విభేదాలు ఉన్న మాట నిజమే..

- 25 మంది ఎమ్మెల్యేలతో రాజగోపాల్ రెడ్డి సీక్రెట్ మీటింగ్ అంటూ ప్రచారం
- ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పిన కోమటిరెడ్డి
- పార్టీలో చీలిక తెచ్చే ఉద్దేశం లేదని వ్యాఖ్య



## బండి సంజయ్ దొంగ ఓట్లతో గెలిచాడు..
## బీఆర్ఎస్ మూడు ముక్కలైంది

- తెలంగాణలోని 8 మంది బీజేపీ ఎంపీలపైనా అనుమానం ఉందన్న మహేశ్
- దొంగ ఓట్లతోనే మోదీ అధికారంలోకి వచ్చారంటూ విమర్శ
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 100 సీట్లు ఖాయమని ధీమా



## విద్యార్థిపై లాఠీ పడితే..
### తెలంగాణ సమాజం ఊరుకోదు

- పోలీసు బలం, బలగంతో విద్యార్థుల నిరసన జ్వాలలను చల్లార్చలేరు
- ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల అరెస్ట్ అప్రజాస్వామికం
- అరెస్ట్ చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్



# ఫీజుల పెంపా? కుదింపా?

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
ఇంజనీరింగ్ ఫీజుల పెంపు అంశాన్ని రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ (ఎఫ్ఆర్‌సీ) సోమవారం నుంచి తిరిగి పరిశీలించనుంది. అన్ని డాక్యుమెంట్లతో హాజరవ్వాలని ఇప్పటికే 180 కాలేజీలకు నోటీసులు పంపింది. తొలి రోజు 20 కాలేజీలతో చర్చించేందుకు షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ ప్రక్రియ వచ్చే నెల 3వ తేదీ వర కు కొనసాగుతుంది. 2025-28 బ్లాక్ పీరియడ్‌కు ఇంజనీరింగ్ కాలేజీల్లో వివిధ కోర్సులకు ఫీజులను ఖరారు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఆరు నెలల క్రితమే మొదలైంది. కాలేజీల డాక్యుమెంట్లు, ఆడిట్ రిపోర్టులను కమిటీ పరిశీలించింది. కాలేజీలతో చర్చించి ప్రతిపాదిత ఫీజులతో నివేదికను ప్రభుత్వానికి పంపింది. ప్రభుత్వం అందుకు అంగీకరించకుండా ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి నేతృత్వంలో ప్రత్యేక

మిగతా 5వ పేజీలో..

- ఇంజనీరింగ్ ఫీజులపై నేటి నుంచి కసరత్తు
- ఎఫ్ఆర్‌సీ ముందుకు ప్రైవేటు కాలేజీలు
- కొత్త మార్గదర్శకాల ప్రకారం పరిశీలన
- జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులపై దృష్టి
- ఎఫ్ఆర్‌సీ ఆడిటర్లను మార్చే యోచన
- మరోవైపు ప్రైవేటు కాలేజీల అంతర్మథనం
- వచ్చేవారం సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చ!



## ఉస్మానియా వర్సిటీని ఆక్స్‌ఫర్డ్ స్థాయిలో

# అభివృద్ధి చేస్తా



**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

తెలంగాణ, ఉస్మానియా యూనివర్సిటీలు అవిభక్త కవలలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇవాళ ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో పలు అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. రూ.90 కోట్లతో నిర్మించిన హాస్టల్ భవనాలను సీఎం ప్రారంభించారు. అనంతరం డిజిటల్ లైబ్రరీతో పాటు రీడింగ్ రూమ్‌ను ఓపెన్ చేశారు. అదేవిధంగా దుందుభి, భీమా వసతి భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, ఓయూ వైస్ ఛాన్స్‌లర్ వీసీ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉస్మానియా వర్సిటీలో పర్యటించాలంటూ వీసీ ఆహ్వానించారని, అభివృద్ధి కార్యక్రమాలనుప్రారంభించాలని కోరారని తెలిపారు. ఉస్మానియా వర్సిటీ అనే పదం తెలంగాణకు ప్రత్యామ్నాయ పదమని అన్నారు.నిజాం నవాబును పొగుడుతూ పాడటం కాదు.. దేశ స్వాతంత్ర్యం కోసం ఓయూ గడ్డపై నిలబడి వందేమాతరం పాడిన పీవీ నరసింహా రావు నేడు తనకు గుర్తొస్తున్నారని తెలిపారు. సాయుధ పోరాటంలో భాగంగా మారుమూల పల్లెల్లో ఎర్రజెండా పట్టుకుని పోరాటం చేసిన ఎందరో మహాభావులు ఉస్మానియా యూనివర్సిటీ అండగా నిలబడిందని అన్నారు. జాతీయ స్థాయిలో హోంమంత్రిగా పనిచేసిన శివరాజ్ పాటిల్‌తో మొదలు పెడితే.. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన పీవీ నరసింహా రావు లాంటి మహనీయులు చదివిన వర్సిటీ.. ఉస్మానియా వర్సిటీ అని కొనియాడారు.

**ఉస్మానియాను కాలగర్భంలో కలపాలని చూశారు..**

తెలంగాణ తొలితరం మర్రి చెన్నారెడ్డి, మల్లికార్జున్ గౌడ్, మదన్మోహన్ లాంటి వాళ్లు కూడా ఓయూ విద్యార్థులేనని అన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఘనత సాధించిన మాజీ కేంద్ర మంత్రి సూదిని జైపాల్ రెడ్డి కూడా ఓయూ బిడ్డేనని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉస్మానియా యూనివర్సిటీ పాత్ర చరిత్ర మరువదని అన్నారు. నేటికీ తెలంగాణలో ఏ సమస్య వచ్చినా.. ఉద్యమానికి పురిటి గడ్డ ఉస్మానియా యూనివర్సిటీయేనని పేర్కొన్నారు. చదువుతో పాటు పోరాటాన్ని నేర్పింది వర్సిటీయేనని.. తెలంగాణ సాధన యాదయ్య, శ్రీకాంతా చారి, వేణుగోపాల్ రెడ్డి కోసం అమరుడయ్యాడని గుర్తు చేశారు. అలాంటి చైతన్యాన్ని రగిల్చిన ఉస్మానియాను కొందరు కాలగర్భంలో కలిపాలని చూశారని ఆరోపించారు. 108 ఏళ్ల యూనివర్సిటీకి ఓ దళితుడిని వీసీగా చేసి చూపించామని అన్నారు. ఇక్కడే చదువుకున్న వారికి విద్యారంగంలో కీలక పదవులు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

**డ్రగ్స్, గంజాయి కల్చర్ వేగంగా విస్తరిస్తోంది..**

నేడు దేశానికి యువ నాయకత్వం అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమస్యల చర్చే కాదు.. సైద్ధాంతిక అంశాలకు కూడా వేదిక కావాలన్నారు. సామాజిక, సాంకేతిక అంశాలపై డిస్కషన్ జరగాలని అన్నారు. మనలో అసహనం పెరిగిందని, అశాంతి ఎక్కువైందని కామెంట్ చేశారు. చర్చించే వారిపై అణిచివేత ఎక్కువ కాలం నిలబడదని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో పరిణామాలు మానసిక వేదనకు గురిచేస్తున్నాయని తెలిపారు. కాలేజీల్లో కూడా విద్యార్థులు గంజాయికి అలవాటు పడుతున్నారని అన్నారు. డ్రగ్స్, గంజాయి కల్చర్ వేగంగా విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా సంస్థల్లో చైతన్యవంతమైన చర్యలు లేకపోవడం వల్లే అసాంఘిక కార్యక్రమాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. పేదలకు పంచేందుకు భూములు లేవని.. పేదల తలరాతలను మార్చేందుకు ప్రభుత్వం ఇవ్వగలిగింది నాణ్యమైన విద్య అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**ఓయూకు మళ్లీ వస్తా..**
**ఈసారి ఒక్క పోలీస్ ఉండొద్దు**

తాను కూడా పేదరికం నుంచి ఈ స్థాయికి వచ్చానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులు వారిని నష్టం చేసిన వాళ్లను నిర్ద్వందంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మన బడ్జెట్ రూ.లక్ష కోట్లు కాళేశ్వరం రూపంలో గంగలో కలిశాయని అన్నారు. కానీ, తమ ప్రభుత్వం రూ.25 వేల కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా యంగ్ ఇండియా స్కూళ్లను నిర్మిస్తోందని తెలిపారు. తాను మళ్లీ ఉస్మానియా యూనివర్సిటీ తప్పకుండా వస్తానని.. డిసెంబర్‌లో ఆర్ట్స్ కాలేజీ ముందు మీటింగ్ పెడతానని అన్నారు. క్యాంపస్ పరిధిలో ఒక్క పోలీస్ కూడా ఉండొద్దని.. ఎవరి అభిప్రాయం వాళ్లు చెప్పొచ్చని అన్నారు. అప్పుడు విద్యార్థులు నిరసన తెలిపినా తాను ఏమీ అనబోనని తెలిపారు. విద్యార్థులు లేవనెత్తిన సమస్యలపై అదేరోజు అక్కడికక్కడే ఓయూ అభివృద్ధి పనులకు జీవోలు ఇస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

**మరో 15 రోజుల్లో ఎమ్మెల్సీగా కోదండరాంను పంపుతాం**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో ఏనుగులు సింహాలు ఉన్నాయంటూ ఏఐ టెక్నాలజీతో వీడియో క్రియేట్ చేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కానీ ఏనుగులు, మానవ మృగాలు ఫామ్‌హౌస్‌లో ఉన్నాయని.. ముందు వాటిని బంధించాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీ పదవిపై ఢిల్లీ వరకు వెళ్లి కుట్రలు చేశారని.. మరో 15 రోజుల్లోగా ఎమ్మెల్సీగా కోదండరామ్‌ను పంపిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఓయూకు రూ.వెయ్యి కోట్లు మంజూరు చేస్తానని.. ఇంజినీర్స్ కమిటీ వేయాలంటూ యోగితారాణాను సీఎం ఆదేశించారు.

---

## రేవంత్ రెడ్డితో విభేదాలు

# ఉన్న మాట నిజమే..

- **25 మంది ఎమ్మెల్యేలతో రాజగోపాల్ రెడ్డి సీక్రెట్ మీటింగ్ అంటూ ప్రచారం**
- **ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పిన కోమటిరెడ్డి**
- **పార్టీలో చీలిక తెచ్చే ఉద్దేశం లేదని వ్యాఖ్య**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

తాను 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో రహస్యంగా సమావేశమయ్యానంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ వార్తలను ఆయన పూర్తిగా ఖండించారు. కొంతమంది ఎమ్మెల్యేలు తనను మామూలుగానే కలిశారని, దానిని ఒక సమావేశంగా చిత్రీకరిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన వివరణ ఇచ్చారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు కొన్ని విషయాల్లో అభిప్రాయ భేదాలు ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ, పార్టీలో చీలిక తీసుకువచ్చే ఆలోచన తనకు లేదని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీకి నష్టం కలిగించే పనులు తాను చేయబోనని ఆయన అన్నారు. ఇటీవల కాలంలో రేవంత్ రెడ్డి పనితీరుపై రాజగోపాల్ రెడ్డి బహిరంగంగానే కొన్ని విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయన రహస్య భేటీ నిర్వహించారనే వార్తలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపాయి.
మరోవైపు, బీజేపీ నేత ఈటల రాజేందర్‌తో కలిసి రాజగోపాల్ రెడ్డి కొత్త పార్టీ పెట్టబోతున్నారనే ఊహాగానాలు కూడా మీడియాలో బలంగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యేలతో సమావేశం వార్త బయటకు రావడంతో ఆ ఊహాగానాలకు మరింత బలం చేకూరినట్టయింది. అయితే, రాజగోపాల్ రెడ్డి స్వయంగా ఈ ప్రచారాన్ని కొట్టిపారేయడంతో ప్రస్తుతానికి ఈ చర్చకు తెరపడినట్లయింది. అయినప్పటికీ, అధికార పార్టీలో ఒక సీనియర్ ఎమ్మెల్యేపై ఇలాంటి వార్తలు రావడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేపుతోంది.



---

# ప్రధాని జైలుకెళ్లినా.. రాజీనామా చేయాల్సిందే

- **ప్రధాని, సీఎంలు 30 రోజులు జైల్లో ఉంటే పదవి కోల్పోతారని వెల్లడి**
- **ఈ నిబంధన మోదీకి కూడా వర్తిస్తుందని స్పష్టీకరణ**
- **జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపడం ప్రజాస్వామ్యానికి అవమానమన్న హోంమంత్రి**
- **ఇది రాజకీయ కుట్రేనంటూ ప్రతిపక్షాల తీవ్ర నిరసన**

**జర్నలిస్ట్ డైరీ, ఢిల్లీ:**

జైలుకు వెళ్లిన మంత్రుల పదవుల తొలగింపునకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుపై వస్తున్న విమర్శలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా గట్టిగా తిప్పికొట్టారు. ఈ బిల్లు ప్రకారం, ప్రధాని నరేంద్ర మోదీ జైలుకు వెళ్లినా తన పదవిని కోల్పోవాల్సి ఉంటుందని, ఆయన తనకు తాను ఈ నిబంధనను వర్తింపజేసుకున్నారని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో పస లేదని ఆయన కొట్టిపారేశారు.
గతవారం కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టింది. వీటిలో ఒకటైన రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు, 2025 ప్రకారం.. కనీసం ఐదేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉన్న కేసులో ప్రధాని, కేంద్ర మంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు అరెస్టయి 30 రోజుల పాటు కస్టడీలో ఉంటే, 31వ రోజున వారు ఆటోమేటిక్‌గా తమ పదవులను కోల్పోతారు. అయితే, ఇది బీజేపీయేతర ప్రభుత్వాలను అస్థిరపరిచే కుట్ర అని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.
ఈ నేపథ్యంలో ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడిన అమిత్ షా, ప్రతిపక్షాల తీరుపై మండిపడ్డారు. "ఒక ముఖ్యమంత్రి గానీ, ప్రధాని గానీ జైలు నుంచి దేశాన్ని పాలించడం సాధ్యమేనా? ఇది మన ప్రజాస్వామ్య గౌరవానికి తగినదేనా? జైలునే సీఎం హౌస్, పీఎం హౌస్‌గా మార్చేసి.. అక్కడి నుంచే డీజీపీ, చీఫ్ సెక్రటరీలకు ఆదేశాలిస్తారా? ఒక వ్యక్తి లేకపోతే దేశ పాలన ఆగిపోతుందన్న వాదనను నా పార్టీ, నేను పూర్తిగా తిరస్కరిస్తున్నాం" అని ఆయన అన్నారు.
గతంలో ఇందిరా గాంధీ తన పదవిని కాపాడుకోవడానికి 39వ రాజ్యాంగ సవరణ తెచ్చారని, కానీ ప్రధాని మోదీ మాత్రం తనకు కూడా వర్తించేలా చట్టం తీసుకొచ్చారని అమిత్ షా గుర్తుచేశారు. ఈ బిల్లు వల్ల పార్లమెంటులో గానీ, అసెంబ్లీలో గానీ ఎవరి మెజారిటీకి నష్టం వాటిల్లదని స్పష్టం చేశారు.
"ఒక సభ్యుడు జైలుకు వెళ్తే, పార్టీకి చెందిన మరో సభ్యుడు ప్రభుత్వాన్ని నడుపుతారు. బెయిల్ వచ్చాక మళ్లీ ప్రమాణ స్వీకారం చేయొచ్చు. దీనికి అభ్యంతరం ఎందుకు?" అని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనీయకుండా ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించడం సరికాదని, దీనిపై ఉభయ సభల సంయుక్త కమిటీలో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.



---



# కేసీఆర్ ను కడియం శ్రీహరి బ్లాక్ మెయిల్ చేశారు

- **కూతురి ఎంపీ చేయడం కోసమే కడియం పార్టీ మారారని రాజయ్య ఆరోపణ**
- **కడియం ఒక అవినీతి తిమింగలమంటూ ఘాటు వ్యాఖ్యలు**
- **విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు పోస్టులు అమ్ముకున్నారని విమర్శ**
- **విదేశాల్లో ఆస్తులు, బినామీ లావాదేవీలు ఉన్నాయని ఆరోపణలు**
- **స్పీకర్ వెంటనే కడియం అనర్హతపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఒక అవినీతి తిమింగలమని, ఆయన ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారో కూడా చెప్పలేని అయోమయ స్థితిలో ఉన్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తాటికొండ రాజయ్య ఎద్దేవా చేశారు. కేవలం తన కుమార్తెకు ఎంపీ టికెట్ ఇప్పించుకోవడం కోసమే శ్రీహరి పార్టీ మారారని, తన రాజకీయ సమాధిని తానే నిర్మించుకున్నారని ఆయన అన్నారు.
ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో చేరానని స్వయంగా ప్రకటించిన కడియం శ్రీహరి, ఇప్పుడు అభివృద్ధి కోసం పార్టీ మారినట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. "పదిహేనేళ్ల పాటు మంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు గుర్తుకురాని అభివృద్ధి, ఇప్పుడు కొత్తగా గుర్తుకువచ్చిందా?" అని రాజయ్య నిలదీశారు. స్టేషన్ ఘన్‌పూర్‌ను అభివృద్ధి చేయడం పక్కనపెట్టి, కడియం శ్రీహరి మాత్రమే అభివృద్ధి చెందారని ఆరోపించారు.
శ్రీహరి విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఉద్యోగాలను అమ్ముకున్నారని, కాంట్రాక్టర్ల నుంచి పెద్దఎత్తున డబ్బులు వసూలు చేశారని విమర్శించారు. అంతేకాకుండా, విదేశాల్లో ఆస్తులు కూడబెట్టారని, హైడల్ ప్రాజెక్టులను అమ్ముకున్నారని, బినామీ పేర్లతో ఆయనకు భారీగా ఆస్తులున్నాయని ఆరోపించారు. టికెట్ ఇవ్వకపోతే పార్టీ మారుతానంటూ కేసీఆర్‌ను సైతం కడియం బ్లాక్‌మెయిల్ చేశారని రాజయ్య వ్యాఖ్యానించారు.
ఫిరాయింపుల విషయంలో స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలని రాజయ్య డిమాండ్ చేశారు. "జస్టిస్ బీఆర్ గవాయ్ మూడు నెలల గడువు ఇచ్చారు. స్పీకర్ రాజ్యాంగాన్ని గౌరవించి, అంబేద్కర్ మీద గౌరవం ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లు వింటే స్పీకర్ కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లే అవుతుంది" అని హెచ్చరించారు. కడియం శ్రీహరికి ప్రజలు కచ్చితంగా కర్రుకాల్చి వాత పెడతారని రాజయ్య జోస్యం చెప్పారు.

---



# అనంతగిరి రిసార్ట్స్‌కి కొత్త రూపు..

- **అనంతగిరి హరిత రిసార్ట్స్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా కలెక్టర్‌కి బాధ్యత**
- **ప్రైవేట్ రిసార్ట్స్‌కు ఏమాత్రం తీసిపోని ఆధునిక సౌకర్యాలు**
- **ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ ఆదాయ వనరులు పెరుగుదలపై నమ్మకం**
- **అనంతగిరి పర్వత సౌందర్యం పర్యాటకులను ఆకర్షిస్తుందన్న మంత్రి విశ్వాసం**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

వికారాబాద్ జిల్లా అనంతగిరి పర్యాటక అభివృద్ధి దిశగా పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పలు చర్యలు చేపట్టారు. వికారాబాద్ కేంద్రంలో ఆయన అనంతగిరి హరిత రిసార్ట్స్, అనంతగిరి వ్యూ టవర్ ప్రాంతాలను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, హరిత రిసార్ట్స్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పర్యవేక్షణలో అప్పగించినట్లు తెలిపారు. ప్రైవేట్ రిసార్ట్స్ అందించే సౌకర్యాలకు ఏమాత్రం తీసిపోకుండా ఆధునిక సదుపాయాలతో హరిత రిసార్ట్స్‌ను అభివృద్ధి చేయాలని ఆయన స్పష్టం చేశారు.
ఈ ప్రాజెక్టు ద్వారా వికారాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి, ప్రభుత్వానికి ఆదాయ వనరులు విస్తరించి, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడతాయని మంత్రి నమ్మకం వ్యక్తం చేశారు. కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకుని అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వికారాబాద్ పర్యాటక దృష్టిలో ప్రత్యేకత కలిగిన ప్రదేశమని, అనంతగిరి పర్వతాల అందాలు, హరిత రిసార్ట్స్ సదుపాయాలు, వ్యూ టవర్ ఆకర్షణలు మరింత మంది సందర్శకులను ఆకట్టుకుంటాయని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

---

# స్వదేశీ ఉద్యమానికి యువతే నాయకత్వం వహించాలి

- **అహ్మదాబాద్‌లో సర్దార్‌ధామ్ బాలికల హాస్టల్‌కు వీడియో సందేశం ద్వారా శంకుస్థాపన**
- **స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రజలకు, యువతకు ప్రధాని మోదీ పిలుపు**
- **మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ప్రధాని మోదీ**



**జర్నలిస్ట్ డైరీ, అహ్మదాబాద్:**

దేశ స్వావలంబనకు స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడమే కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇది వందేళ్ల నాటి పాత నినాదం కాదని, దేశ భవిష్యత్తును బలోపేతం చేసే ఆధునిక ప్రచారమని ఆయన స్పష్టం చేశారు. ఈ నూతన స్వదేశీ ఉద్యమానికి సమాజం, ముఖ్యంగా యువత నాయకత్వం వహించాలని ఆయన పిలుపునిచ్చారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సర్దార్‌ధామ్ ఫేజ్ 2 కన్యా ఛాత్రాలయ (బాలికల వసతి గృహం) శంకుస్థాపన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆదివారం ఆయన వీడియో సందేశం ద్వారా ప్రసంగించారు.
ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, ప్రతి దుకాణదారుడు తమ వద్ద "కేవలం స్వదేశీ ఉత్పత్తులు మాత్రమే అమ్ముతాం" అనే బోర్డును ప్రదర్శించాలని సూచించారు. కుటుంబాలు కూడా దేశీయంగా తయారైన వస్తువులనే కొనుగోలు చేయాలని కోరారు. మంచి ఉద్దేశంతో పవిత్రమైన లక్ష్యంతో సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తే దైవబలం కూడా తోడవుతుందని ఆయన పేర్కొన్నారు.
మహిళా సాధికారత దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని నొక్కిచెప్పారు. కొత్తగా నిర్మిస్తున్న ఈ హాస్టల్‌లో 3,000 మంది బాలికలకు వసతి కల్పించనున్నామని, ఇది వారిని ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా చేస్తుందని తెలిపారు. వడోదర, సూరత్, రాజ్‌కోట్, మెహసానా వంటి నగరాల్లోనూ ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు బాలికా విద్య కోసం ప్రారంభించిన 'కన్యా శిక్షా రథ యాత్ర' వంటి కార్యక్రమాలు ఇప్పుడు 'బేటీ బచావో, బేటీ పఢావో' రూపంలో దేశవ్యాప్త ఉద్యమంగా మారాయని గుర్తుచేశారు.
గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఆర్థిక అవకాశాలు కల్పించేందుకు 'లఖ్‌పతి దీదీలు', 'డ్రోన్ దీదీ', 'బ్యాంక్ సఖి' వంటి పథకాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని మోదీ తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం ద్వారా నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రపంచవ్యాప్తంగా భారత నైపుణ్య మానవ వనరులకు డిమాండ్ పెరుగుతోందని అన్నారు.
సౌరశక్తి, రక్షణ, డ్రోన్ పరిశ్రమలతో పాటు స్టార్టప్‌ల రంగంలో దేశం రికార్డు స్థాయిలో పురోగమిస్తోందని చెప్పారు. ఉపాధి అవకాశాలను పెంచే లక్ష్యంతోనే ఈ నెలలో రూ.1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

---

## బండి సంజయ్ దొంగ ఓట్లతో గెలిచాడు..

# బీఆర్ఎస్ మూడు ముక్కలైంది

- **తెలంగాణలోని 8 మంది బీజేపీ ఎంపీలపైనా అనుమానం ఉందన్న మహేశ్ గౌడ్**
- **దొంగ ఓట్లతోనే మోదీ అధికారంలోకి వచ్చారంటూ విమర్శ**
- **వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 100 సీట్లు ఖాయమని ధీమా**

**హైదరాబాద్ ఆగస్టు 25 (ప్రజాక్షేత్రం):**

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు గుప్పించారు. కరీంనగర్‌లో బండి సంజయ్ విజయం దొంగ ఓట్లతోనే సాధ్యమైందని, తెలంగాణలోని మిగతా బీజేపీ ఎంపీల గెలుపుపైనా తమకు అనుమానాలున్నాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. కరీంనగర్ జిల్లాలో చేపట్టిన జనహిత యాత్రలో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.
ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ మాట్లాడుతూ, "కరీంనగర్‌లో బండి సంజయ్ గెలుపు దొంగ ఓట్ల వల్లే జరిగింది. రాష్ట్రంలోని మిగతా 8 మంది బీజేపీ ఎంపీలు కూడా ఇలాగే గెలిచారేమోనని అనుమానంగా ఉంది" అని అన్నారు. బీసీల సమస్యలను పక్కనపెట్టి బండి సంజయ్ ఢిల్లీకి పరిమితమయ్యారని, రాష్ట్ర సమస్యలపై స్పందించడం లేదని విమర్శించారు. ప్రధాని మోదీ సైతం ప్రజల మద్దతుతో కాకుండా దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చారని ఆయన ఆరోపించారు.
ఇదే సమయంలో బీఆర్ఎస్ పార్టీపైనా ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ ఇప్పటికే మూడు ముక్కలైందని, త్వరలోనే నాలుగో ముక్క కూడా బయటకు వస్తుందని జోస్యం చెప్పారు. తెలంగాణలో ఇక కాంగ్రెస్ పార్టీకి తప్ప మరే పార్టీకి భవిష్యత్తు లేదని, వచ్చే ఎన్నికల్లో వందకు తగ్గకుండా సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.
ప్రజల కష్టసుఖాలు తెలుసుకుని, వారి భవిష్యత్తుకు భరోసా ఇచ్చేందుకే ఈ జనహిత యాత్ర చేపట్టామని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేయలేకపోయిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే ఇళ్లను సిద్ధం చేసి చూపిస్తోందని తెలిపారు. కులం, మతం పేరుతో ఓట్లు అడగటం బీజేపీకి అలవాటు అని, కాంగ్రెస్ పార్టీ మాత్రం అభివృద్ధి, సంక్షేమ అజెండాతోనే ప్రజల ముందుకు వెళ్తుందని ఆయన అన్నారు.




# పర్యావరణం కోసం మట్టి వినాయకులను పూజిద్దాం!

- **ఉచిత పంపణీ కార్యక్రమంలో పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ**



**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో(ఆగస్టు 25):**
వినాయకచవితిని పురస్కరించుకుని మట్టి వినాయకుల ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని వివేకానంద నగర్‌లో పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ కార్యలయంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాద్యత తీసుకోవాలని , ఉచితంగా మట్టి వినాయకుల ప్రతిమలు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉంది అని, మట్టి వినాయకుల పంపిణీ చేపడుతూ పర్యావారణ విషయంలో తమదైన పాత్ర పోషించడం పట్ల ప్రజలు అవగహన కలిగి ఉండలాని, ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, కాలనీ వాసులు ప్రతి ఒక్కరు సమాజ హితం మట్టి వినాయకులను పూజించాలని, పర్యావరణంను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉంది అని తెలియచేసారు.వినాయక ప్రతిమలను చేసేది మట్టితో అలకరించేది ఆకులతో, పూజించేది పూలతో , నిమజ్జనం చేసేది నీటితో గణపతి అంటే ఆకృతి కాదు, ప్రకృతి మన సనాతన సంస్కృతి అని తెలియచేసారు.

మట్టి వినాయకులను పూజించి మన యొక్క పర్యావరణాన్ని కాపాడుకుందాం మరియు చెరువులను కలుషితం చేయకుండా వీలైనంత వరుకు మట్టి వినాయకులను మన యొక్క స్వగృహం ప్రాంగణంలో నే నిమర్జనం చేసుకోవాల్సిందిగా కోరుతున్నాము అని , అదేవిధంగా పర్యావరణ హితం మట్టి గణపతులను పూజించాలని ఈ విషయంలో మహిళలు ముందుండాలని, ప్రతి ఒక్కరికి అవగహన కలిపించాలని, మట్టి వినాయకులను పూజించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలియచేసారు. అదేవిధంగా భవిష్యత్ తరాల ను దృష్టిలో పెట్టుకొని సమాజ హితం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పర్యావరణ హితం ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను పూజించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసిన వినాయక విగ్రహాల ద్వారా చెరువులు కలుషితం అవుతాయి అని ,పర్యావరణ సమతుల్య త దెబ్బ తింటుంది అని కావున భావితరాలను దృష్టిలో పెట్టుకొని మట్టి వినాయక విగ్రహాలను ప్రతి ఒక్కరు తప్పకుండా పూజించి పర్యావరణంను పరిరక్షించాలని తెలియచేసారు. అదేవిధంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని, మొక్కే శ్రీరామ రక్ష అని, మొక్కలు నాటడం మనందరి సామాజిక బాధ్యత అని, నాటిన మొక్కలను సంరక్షించడం మనందరి బాధ్యత అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, MD ఇబ్రహీం, పురెందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ,జోగిపేట భాస్కర్, అష్రాఫ్, లక్ష్మణ్ రావు,ఆనంద్, శోభన్, అశోక్ రెడ్డి మరియు కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.




## రిజర్వేషన్ల ప్రదాత బీపీ మండల్‌కు బీసీల నివాళి

**జర్నలిస్ట్ డైరీ, యైటింక్లయిన్ కాలనీ(ఆగస్టు 25):**
స్థానిక ప్రైవేట్ పాఠశాలలో సోమవారం ఇ.వి.ఎస్ ఎన్జీవో చైర్మన్ ఇరికి మహేష్ ఆధ్వర్యంలో, బీసీ రిజర్వేషన్ల ప్రదాత బిందెశ్వర ప్రసాద్ మండల్ 107వ జయంతి కార్యక్రమం జరిగింది. సాయంత్రం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన బిందెశ్వర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ.వి.ఎస్ ఎన్జివొ చైర్మన్ ఇరికి మహేష్ బీసీల చైతన్య స్రవంతి, సామాజిక న్యాయం, చట్టబద్ధ న్యాయం, అసమానంగా ఉన్న నేపథ్యంలో ఓబీసీలకు అంత దామాషా ప్రకారం సహజ న్యాయ సూత్రానికి కట్టుబడి ఏర్పడిందే మండల్ కమిషన్, ఈ కమిషన్ ఛైర్మన్ బిందెశ్వర్ ప్రసాద్ మండల్ గా కొనియాడారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఓబీసీ వర్గానికి చెందిన వివిధ సంఘాల సభ్యులు జె. దామోదర్ రావు, రేశవేణి కేశవులు, మారెలి చిన్న రాజిరెడ్డి, అనుముల రాములు, పూజారి సాయిలు, ఇరికి రాజేశ్వరి, బాదే తేజ్, ఈశ్వర్ నాయక్, సాయి పాల్గొన్నారు.

# 20 ఏళ్ల పోరాటానికి ముగింపు ఎన్నడు?

- **కలెక్టర్లు, అధికారులు మారుతున్నా.. న్యాయం మాత్రం జరగడం లేదు**
- **ప్రజావాణిలో ధర్నాకు దిగిన సోలీపూర్ గ్రామ భూ బాధితులు**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో(ఆగస్టు 25):**
కలెక్టర్లు, అధికారులు మారుతున్నా తమ 20 ఏళ్ల పోరాటానికి తగిన న్యాయం జరగడం లేదని సోలీపూర్ గ్రామ భూబాధితులు వాపోతున్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా సోలీపూర్ గ్రామం, ఫరూక్ నగర్ మండలానికి చెందిన భూబాధితులు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఆందోళనదిగారు. సుప్రీం బిల్డర్ వారు అధికారుల అండదండలతో రెచ్చిపోతున్నారని హైకోర్టు నుండి స్టేటస్ కో ఉన్నా బేఖాతరు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 22/లు సర్వే నెంబర్లు లో 12 ఎకరాల భూమి పట్టాదారు ఉమర్ బీన్ సయ్యద్ ద్వారా పద్మ జంగయ్య,చంద్రయ్య కు గిఫ్ట్ డీడ్ ద్వారా వచ్చిందని భూ బాధితులు తెలిపారు. తమ సొంత లాండ్ పై కి వెళితే సుప్రీం కన్స్ట్రక్షన్ వారు దాడికి పాల్పడుతున్నారని,బెదిరింపులకు గురి చేస్తున్నారని,ఫోన్స్ ద్వారా చంపేస్తామని వార్నింగ్స్ ఇస్తున్నారని భూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫరూక్ నగర్ ఎంఆర్ఓ స్టేటస్ కో విధిస్తూ అక్కడ నోటీసులు అతికించారని వాటిని ఈరోజు తొలగించి సుప్రీమ్ కన్స్ట్రక్షన్ వారు ఏదేచ్ఛగా పనులు మళ్లీ ప్రారంభించడానికి ప్రయత్నం చేస్తున్నారని భూ బాధితులు తెలిపారు. తమకు న్యాయం జరగాలని అధికారులను వేడుకున్నారు.





# చైతన్య నగర్‌లో కుక్కల బెడద

- **భయంభయంగా చిన్నారులు, వాహనదారులు**



**జర్నలిస్ట్ డైరీ, బీన్ రెడ్డి నగర్(ఆగస్ట్ 25):**
చైతన్య నగర్‌లో కుక్కల బెడద తీవ్రస్థాయిలో ఉంది. ముఖ్యంగా రోడ్ నెంబర్ 9లో పరిస్థితి దారుణంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. గుంపులు గుంపులుగా విహరిస్తూ చిన్న పిల్లలను, వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. బయటకు వచ్చిన వారి వెంట పడడంతో ఒంటరిగా రోడ్డు మీదకు రావాలన్నా, ఆడుకోవాలన్నా భయపడుతున్నారు. ప్రతిరోజు పిల్లలను పాఠశాలకు పంపాలన్నా భయమేస్తుందని, కుక్కలను నియంత్రించకపోతే ప్రమాదాలు పెరుగుతాయని స్థానికులు అంటున్నారు. అధికారులు, కాలనీ పెద్దలు తగిన చర్యలు తీసుకోవాలని కుక్కలు బెడద లేకుండా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



## సర్వీ సమాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుర్గామాత పూజ

- **ఆశీస్సులు అందుకున్న పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో-(ఆగస్టు 25):**
చందానగర్ డివిజన్ పరిధిలోని కేఎస్ఆర్ ఎనక్లేవ్ కాలనీ లో సర్వీ సమాజ్ ట్రస్ట్ శేరిలింగంపల్లి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ దుర్గామాత అమ్మవారి పూజ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, రామరాజు మరియు సర్వీ సమాజ్ ట్రస్ట్ సభ్యులు అధ్యక్షులు మనోజ్ చౌదరి, మంగిలాల్ పరిహరియా చౌదరి, వినోద్ చౌదరి, దేవరంజీ, బిక్రమ్ జి, కంగర్ సొయాల్ చౌదరి , హనుమన్ సోయల్ చౌదరి , మంగిలాల్ సొన్పర చౌదరి , వినోద్ గెహ్లోట్ చౌదరి ,, వినయ్ చౌదరి, కెహ్వారామ్ చౌదరి మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్. కృష్ణయ్య సత్యాగ్రహ దీక్షకు మద్దతు

- **షాద్‌నగర్ నుంచి భారీగా బీసీ సేన నాయకులు**



**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో(ఆగస్టు 25):**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సాధించాలనే లక్ష్యంతో జరుగుతున్న సత్యాగ్రహ దీక్ష విజయవంతం కావాలని కోరుతూ హైద్రాబాద్ ఇందిరా పార్కు వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య చేస్తున్న సత్యాగ్రహ దీక్షలో భాగంగా మద్దతు తెలిపేందుకు షాద్ నగర్ బీసీ సేన ఆధ్వర్యంలో షాద్‌నగర్ నుండి జిల్లా అధ్యక్షులు సదర్ శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షులు కత్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున కదలిక జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 50 కార్లలో బీసీ సేన కార్యకర్తలు ఉత్సాహంగా బయలుదేరారు. షాద్ నగర్ రైల్వే స్టేషన్ నుండి ర్యాలీగా కార్లలో బయలు దేరారు. అంతకు ముందు జిల్లా అధ్యక్షులు సదర్ శ్రీనివాస్ జెండా ఊపి ర్యాలీ నీ ప్రారంబించారు.
కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సదర్ శ్రీనివాస్, ఆలుగడ్డ ప్రవీణ్ కుమార్, యాదవ్ మేకల వెంకటేష్, సుధాకర్ కత్తి చంద్రశేఖర అప్ప, జమాల్పూర్ చందూలాల్, తంగడపల్లి శంకర్, పాలది శ్రీనివాస్, భూషం నరేష్, బాస వరలక్ష్మి, ప్యాట జయ, భాగ్యలక్ష్మి, సౌజన్య, వసంత, జక్కుల జలజ, జ్యోతి, స్రవంతిరాజ్, చెరుకు మమత, అనిత, సరస్వతి, అనిత, లక్ష్మి, సంధ్య, సునీత, బాలమణి, రజిత, లక్ష్మి, అనురాధ, సింధూర, పుష్పమ్మ, మంజుల, సువర్ణ, సునీత, యాదమ్మ, మొగిలేసి నరసింహులు, బోయ చెన్నయ్య, రమేష్, పురుషోత్తం గౌడ్, లింగం, కరుణాకర్, గిరి, శ్రీకాంత్ రమేష్ చిన్నయ్య దామోదర్ రాజు, సాయికుమార్, రాఘవేందర్, తోట మహేందర్ చెన్నకేశవులు గణేష్ గౌడ్ కుర్వరాజు చెన్నయ్య రాజు పవన్ వెంకట్ రామకృష్ణ సంజయ్ దామోదర్ రాజు రాఘవేందర్ శ్రీకాంత్ రాము రామయ్య, లింగం, యాదయ్య, నరేష్, నరసింహ, చెన్నయ్య, చందు, వినయ్ రాఘవేందర్ కిషోర్ యాదగిరి, రాజశేఖర్, సత్యనారాయణ, రాజు, అనిల్, బుర్ర బాలయ్య, మాహలింగం, దాసరి నరసింహ, గొల్ల బాలకృష్ణ, మరియు ఇతరులు పాల్గొన్నారు.




## కొత్తపల్లి శ్రీ బంగారు పోచమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నిక

**జర్నలిస్ట్ డైరీ, యాచారం(ఆగస్ట్ 25):**
కొత్తపల్లి గ్రామంలోని శ్రీ బంగారు పోచమ్మ దేవాలయం నూతన కమిటీ అధ్యక్షునిగా కొండాపురం చంద్రయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొత్తగా ఎన్నికైన అధ్యక్షునికి అభినందనలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ హామీ ఇచ్చింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ మాజీ ఉప సర్పంచ్ కావలి జగన్ మాట్లాడుతూ గ్రామస్తుల ఐక్యతతో దేవాలయ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలో రానున్న గణపతి, దుర్గా నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కంబాలపల్లి రవి,కుమార్ , పోలే ప్రశాంత్, శివ, చాట్ల కృష్ణ,కావలి పరమేష్, కొండాపురం బుచ్చయ్య లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కులపై దశలవారి ఆందోళనలు

- **సింగరేణికి టీబీజీకేఎస్ అల్టిమేటం**



**జర్నలిస్ట్ డైరీ, యైటింక్లయిన్ కాలనీ(ఆగస్టు 25):**
గడిచిన సింగరేణి, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఇచ్చిన హామీలను మరిచి, సొంత ప్రయోజనాలకు, పైరవీలకు పరిమితమయ్యాయని, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) సింగరేణి రామగుండం రెండవ ఏరియా ఉపాధ్యక్షులు ఐలి. శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం సాయంత్రం స్థానిక ప్రెస్ భవన్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సమయంలో ఏఐటీయూసీ 47 హామీలను, ఐఎన్టియూసి 6 గ్యారంటీలను, 36 హామీలను ఇచ్చి, గుర్తింపు ప్రాతినిధ్య పత్రాలను పొంది, కార్మికుల హక్కులను కాపాడటంలో విఫలమయ్యాయని దుయ్యబట్టారు. సింగరేణి కార్మికుల న్యాయమైన హక్కులు వాస్తవ లాభాలపై 35 శాతం వాటాను ప్రకటించాలని, ఆదాయపు పన్ను రద్దు చేయాలని, అలవెనుసులపై ఆదాయపు పన్ను యాజమాన్యమే చెల్లించాలని, అనారోగ్య సమస్యలతో మెడికల్ బోర్డు కు వెళ్లిన కార్మికులందరినీ అన్ఫిట్ చేయాలని, అలాగే 26 నెలల కాల పరిమితిని, 36 నెలలకు పెంచాలని, వేలంపాటతో సంబంధం లేకుండా నూతన బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని, అలాగే సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 43 వేల కోట్ల రూపాయల బకాయిలను కోల్బెల్ట్ ఎమ్మెల్యేలు, మంత్రులు బాధ్యత వహించి తక్షణమే ఇప్పించాలని, ఆయన డిమాండ్ చేశారు.
ఇక నూతన బదిలీల పాలసీని రద్దు చేస్తూ, బదిలీల పాలసీ పారదర్శకంగా ఉండాలని, మెడికల్, ట్రైనింగ్ పూర్తి చేసుకున్న డిపెండెంట్లకు వెంటనే నియామకపు పత్రాలు ఇవ్వాలని, 35 నుండి 40 ఏళ్లకు వయస్సు పరిమితి పెంచిన యాజమాన్యం, వారిలో పదోవ తరగతి సర్టిఫికెట్లు లేని వారిని విజిలెన్స్ కు పంపించే విధానాన్ని నిలిపివేస్తూ, వెంటనే వారందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. అలాగే మారుపేర్లపై పనులు చేసి, అన్ఫిట్ అయిన కార్మికుల పిల్లలకు వన్ టైం సెటిల్మెంట్ ప్రకారం ఉద్యోగాలు ఇచ్చి, వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కృషి చేయకుంటే, యూనియన్ గౌరవ అధ్యక్షులు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి చేసిన తీర్మానాల మేరకు ఈ నెల 28న బొగ్గు గనులపై నల్ల బ్యాడ్జీల ధరించి వినతి పత్రాలు అందజేయడం, 29న అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు వినతి పత్రాలు అందజేయడం, సెప్టెంబర్ 2న సాయంత్రం కొత్తగూడెం ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని, అంతేకాకుండా సమస్యల పరిష్కారం, హక్కుల అమలు చేసేంతవరకు, అనేక రూపాల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఐలి. శ్రీనివాస్ హెచ్చరించారు. అనంతరం నాయకులు కరపత్రాలు ఆవిష్కరించారు. ఇంకా ఈ సమావేశంలో నాయకులు సిహెచ్. ప్రభాకర్ రెడ్డి, సురేందర్, చంద్రయ్య, అనిల్ రెడ్డి, శ్రీనివాస్, లింగారెడ్డి, కమలాకర్, అశోక్, సాయి, తదితరులు పాల్గొన్నారు.



## బీపీ మండల్‌కు సింగరేణి ఉద్యోగుల నివాళి

**జర్నలిస్ట్ డైరీ, యైటింక్లయిన్ కాలనీ(ఆగస్టు 25):**
బీసీ రిజర్వేషన్ల ప్రదాత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ బీసీ జాతీయ చైర్మన్, బిందెశ్వర్ ప్రసాద్ మండల్ 107వ జయంతి కార్యక్రమాన్ని, సోమవారం సింగరేణి రామగుండం రెండవ ఏరియా బిసి ఉద్యోగులు నిర్వహించారు. సాయంత్రం ఏరియా పరిధిలోని ఓసిపి త్రీ ప్రాజెక్టు షావెల్ & డ్రిల్ సెక్షన్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న, ఏరియా బిసి అసోసియేషన్ అధ్యక్షులు గాలిపల్లి రవీందర్, ప్రధాన కార్యదర్శి జిగురు రవీందర్ బిందెశ్వర్ ప్రసాద్ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఏరియా సంయుక్త కార్యదర్శి కొంగర రవీందర్, నాయకులు మాచర్ల శ్రీధర్, వేముల కిరణ్, బొడ్డు రమేష్, ప్రకాష్, రాజ సాగర్, ఆనంద్, యు.శ్రీనివాస్, రాజేశం, పోషయ్య, కొమురయ్య, వడ్లకొండ రాజేష్, కోటి, రవీందర్, సత్యనారాయణ, మచ్చ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## బ్రిక్స్ ఉమ్మడి కరెన్సీ అసాధ్యం, అసలు ప్లాన్ వేరే!



బ్రిక్స్ కూటమి గురించి చర్చ వచ్చినప్పుడల్లా ఒకే మాట వినిపిస్తుంది. అమెరికా డాలర్‌ను దెబ్బతీయడానికి ఈ దేశాలన్నీ కలిసి ఒకే కరెన్సీని తీసుకువస్తాయని ప్రచారం జరుగుతోంది. కానీ ఇది వాస్తవానికి చాలా దూరం. బ్రిక్స్ దేశాల మధ్య ఉన్న తీవ్రమైన విభేదాల వల్ల ఉమ్మడి కరెన్సీ అనేది ఒక నెరవేరని కల మాత్రమే. ఈ కూటమి అసలు లక్ష్యం కొత్త కరెన్సీని సృష్టించడం కాదు, ప్రపంచ చెల్లింపుల వ్యవస్థను మార్చడం.

యూరోపియన్ యూనియన్ యూరో కరెన్సీని తీసుకురావడానికి దశాబ్దాల పాటు ఆర్థికంగా, రాజకీయంగా ఏకతాటిపై నడిచింది. అదొక సుదీర్ఘమైన, సంక్లిష్టమైన ప్రక్రియ. ఇప్పుడు విస్తరించిన బ్రిక్స్10 కూటమిలో అలాంటి ఏకీకరణ ఊహించడం కూడా కష్టం. ఈ కూటమిలో ఆర్థిక వైవిధ్యం చాలా ఎక్కువ. ఒకవైపు చైనా సుమారు $19 ట్రిలియన్ల జీడీపీతో ఉంటే, మరోవైపు ఇథియోపియా జీడీపీ కేవలం $150 బిలియన్లు. ద్రవ్యోల్బణం, వృద్ధి రేట్లు, ఆర్థిక విధానాలు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో అందరికీ ఒకే ద్రవ్య విధానం సరిపడదు.

ఇంకో ముఖ్యమైన విషయం, భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా వంటి దేశాలు తమ ద్రవ్య సార్వభౌమత్వాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేవు. తమ కరెన్సీపై నియంత్రణను వేరే సంస్థకు అప్పగించడానికి ఇష్టపడవు. ముఖ్యంగా భారత్, చైనా మధ్య ఉన్న సరిహద్దు వివాదాలు వంటి భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఈ అనుమానాలను మరింత పెంచుతున్నాయి. అందుకే బ్రిక్స్ న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ గానీ, ఆయా దేశాల నాయకులు గానీ ఉమ్మడి కరెన్సీపై తక్షణ ప్రణాళికలు ఏమీ లేవని స్పష్టం చేస్తున్నారు. దీన్ని ఒక "దీర్ఘకాలిక ఆశయం" గానే చూస్తున్నారు తప్ప, ప్రస్తుతం అమలవుతున్న ప్రాజెక్టుగా చూడటం లేదు.

ఈ కూటమిలో ఒక్కో దేశానికి ఒక్కో వ్యూహం ఉంది. అందరూ కలిసి ఒకే లక్ష్యం కోసం పని చేయడం లేదు. ముఖ్యంగా భారత్, చైనా, రష్యా తమ సొంత జాతీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయి.

భారత్ డాలర్‌ను పూర్తిగా వదిలించుకోవాలని చూడటం లేదు. డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ("డీరిస్క్") ప్రయత్నిస్తోంది. ఇందుకోసం భారత రూపాయిని అంతర్జాతీయంగా ద్వైపాక్షిక వాణిజ్యంలో ప్రోత్సహిస్తోంది. ఉమ్మడి బ్రిక్స్ కరెన్సీని భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఎందుకంటే ఆ కరెన్సీపై చైనా ఆధిపత్యం ఉంటుందని భయపడుతోంది.

చైనా లక్ష్యం: డాలర్ కు పోటీగా తమ యువాన్‌ను ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా మార్చాలన్నది చైనా స్పష్టమైన లక్ష్యం. ఈ జాతీయవాద ఆశయం వల్ల, తటస్థంగా ఉండే బ్రిక్స్ కరెన్సీ ఆలోచనను చైనా ఇష్టపడదు. అది తమ ప్రయత్నాలను నీరుగారుస్తుందని భావిస్తుంది.

రష్యా అవసరం: పశ్చిమ దేశాల ఆంక్షల నుంచి బయటపడటమే రష్యా ప్రధాన లక్ష్యం. డాలర్‌పై ఆధారపడని ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోవడం మాస్కోకు జీవన్మరణ సమస్య. అందుకే డాలర్‌కు ప్రత్యామ్నాయంగా ఏది వచ్చినా రష్యా మద్దతు ఇస్తుంది.

బ్రిక్స్ పే: ఉమ్మడి కరెన్సీ అసాధ్యం కాబట్టి, బ్రిక్స్ దేశాలు ఒక ఆచరణాత్మక ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టాయి. అదే "బ్రిక్స్ పే". ఇది బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ ఆధారంగా పనిచేసే ఒక వికేంద్రీకృత చెల్లింపుల వ్యవస్థ. దీనిపై బయటి దేశాల నియంత్రణ ఉండదు. భారత్ UPI, చైనా CIPS వంటి జాతీయ చెల్లింపుల వ్యవస్థలను ఇది అనుసంధానిస్తుంది. దీనివల్ల సభ్య దేశాలు తమ స్థానిక కరెన్సీలలోనే సులభంగా, వేగంగా సరిహద్దు లావాదేవీలు జరుపుకోవచ్చు. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక ప్రత్యేకమైన, సమాంతర వ్యవస్థను నిర్మించే ప్రయత్నం.

బ్రిక్స్ ప్రయత్నాలకు అమెరికా రెండు రకాలుగా స్పందిస్తోంది. ఒకవైపు 100% సుంకాలు విధిస్తామని బెదిరిస్తూ, మరోవైపు క్రిప్టోకరెన్సీని స్వీకరించి ఆర్థిక నాయకత్వాన్ని నిలబెట్టుకోవాలని చూస్తోంది. అయితే, బ్రిక్స్ చొరవలు డాలర్‌ను వెంటనే భర్తీ చేయలేవు. అవి కేవలం ఒక సమాంతర వ్యవస్థను మాత్రమే సృష్టిస్తున్నాయి. అమెరికా మూలధన మార్కెట్ల లోతు, లిక్విడిటీ కారణంగా డాలర్ ఆధిపత్యం బలంగా పాతుకుపోయింది.

ప్రపంచం డాలర్ అనంతర యుగానికి వెళ్లడం లేదు. బదులుగా, బహుళ ధ్రువ ద్రవ్య వ్యవస్థ వైపు పయనిస్తోంది. భవిష్యత్తులో డాలర్, యూరో, యువాన్ వంటి అనేక కరెన్సీ కూటములు ఉంటాయి. దీనివల్ల ప్రపంచ ఆర్థిక స్థిరత్వం పెరిగే అవకాశం ఉంది. కానీ మారకపు రేట్లలో తీవ్రమైన ఒడిదొడుకులు ఉండవచ్చు. ప్రపంచ కార్పొరేషన్లకు ఇది ఒక కొత్త సవాల్.

ఇకపై కేవలం డాలర్‌తో ఆర్థిక వ్యవహారాలు నిర్వహించడం కుదరదు. ఈ సంక్లిష్టమైన ఆర్థిక ప్రపంచంలో మనుగడ సాగించడానికి కొత్త వ్యూహాలు అవసరం. ఈ మొత్తం వివాదం రూపాయి డాలర్‌ను భర్తీ చేయడం గురించి కాదు. నెమ్మదిగా మారుతున్న ఈ బహుళ ధ్రువ (Multi Polar) ప్రపంచంలో, డాలర్ యొక్క తిరుగులేని అవసరాన్ని తగ్గించే అనేక కరెన్సీల ఆవిర్భావం గురించి.

**నవీన్**
**సీనియర్ జర్నలిస్ట్**

## రేపటి నుంచి ఢిల్లీలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు.. కాంగ్రెస్‌కు ఆహ్వానం..



రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్.. ఈ ఏడాది విజయదశమి రోజున 100 ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. ఈసందర్భంగా దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ అనేక శతాబ్ది ఉత్సవాల కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఆగస్టు 26 నుంచి 28 వరకు మూడు రోజుల ఉపన్యాసంతో శతాబ్ది సంవత్సర కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఇక్కడో ప్రత్యేకత ఏమిటంటే ఆర్ఎస్ఎస్ వాళ్లు కాంగ్రెస్ పార్టీకి కార్యక్రమానికి రావాలని ఆహ్వానం పంపించారు.

**ఏకతాటిపైకి తీసుకురావడానికి ప్రయత్నాలు..**

ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యం సంఘ్ గురించి సవివరమైన సమాచారాన్ని సమాజానికి అందించడమని పలువురు ఆర్ఎస్ఎస్ నాయకులు తెలిపారు. ఢిల్లీలో జరగనున్న ఈ కార్యక్రమంలో సర్ సంఘచాలక్ సంఘ్ స్వచ్ఛంద సేవకులు పాల్గొననున్నారు. ఇప్పటివరకు సంఘ్ ప్రయాణంతో పాటు, సమాజంలో సంఘ్ పట్ల వ్యాపించిన అపోహలను తొలగించడానికి ఈ సమావేశంలో చర్చించనున్నారు. దీనితో పాటు ఇప్పటి వరకు సంఘ్‌కు దూరంగా ఉన్న ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడానికి కూడా ప్రయత్నాలు జరుగుతాయని సమాచారం. అనేక దేశాల నుంచి దౌత్యవేత్తలను కూడా ఈ సెమినార్‌కు ఆహ్వానించారు. అలాగే క్రీడలు, కళలు, మీడియా, స్టార్టప్‌లు, న్యాయ వ్యవస్థ, అధికారులు, దౌత్యవేత్తలు, రాజకీయ నాయకులు, ఆలోచనాపరులు, ప్రభావశీలులు వంటి అనేక రంగాలకు చెందిన వ్యక్తులను ఆహ్వానించారు. కార్యక్రమంలో పాల్గొనాలని దాదాపు 2000 మంది ప్రముఖులకు ఆహ్వానాలు అందాయి. ఆగస్టు 26న సంఘ యాత్ర 100 సంవత్సరాల నిర్వహణపై చర్చ ఉంటుంది. రెండవ రోజు భవిష్యత్తు దృక్కోణం నుంచి సంఘ్ అభిప్రాయాలపై చర్చ, మూడవ రోజు సంఘ్ చీఫ్‌తో ప్రశ్నోత్తరాల కార్యక్రమం ఉంటుంది.

**ఆర్ఎస్ఎస్ కానీ వాళ్లకు కూడా..**

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లతో సంబంధం లేకుండా పార్టీలో చేరిన నాయకులు కేంద్ర మంత్రులు రవ్‌నీత్ సింగ్ బిట్టు, జ్యోతిరాదిత్య సింధియా, అప్నాదళ్ నాయకురాలు, కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్, జేడీయూకు చెందిన కెసి త్యాగి, సంజయ్ ఝా, టీడీపీ నుంచి కేంద్ర విమానయాన మంత్రి రామ్ మోహన్ నాయుడు వంటి నాయకుల పేర్లు ఆర్ఎస్ఎస్ అతిథి జాబితాలో ఉన్నాయి. కార్యక్రమానికి కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్ష పార్టీల నాయకులందరికీ ఆర్ఎస్ఎస్ ఆహ్వానాలు పంపింది. మైనారిటీలు, ముఖ్యంగా ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులను కూడా ఆహ్వానించారు. కాంగ్రెస్‌తో సహా ప్రతి రాజకీయ పార్టీ నాయకులను మేము ఆహ్వానించామని ఆర్ఎస్ఎస్ సీనియర్ కార్యకర్త ఒకరు తెలిపారు.

## "ఏపీలో పట్టు తప్పుతున్న ఆర్థిక వ్యవస్థ." : ఒక విశ్లేషణ

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు ఒక క్లిష్టమైన మలుపులో ఉంది. రాష్ట్రం గత కొన్ని సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లు మరింత తీవ్రమవుతున్నాయి. 202526 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన నాలుగు నెలల్లోనే ఆదాయ లోటు అంచనాలను మించిపోవడం, ద్రవ్య లోటు 60 శాతం దాటడం వంటి వార్తలు రాష్ట్ర ఖజానా పరిస్థితిని మరోసారి ప్రశ్నార్థకంగా మార్చాయి. బడ్జెట్‌లో వేసుకున్న లక్ష్యాలు వాస్తవానికి ఎంత దూరంగా ఉన్నాయో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో రుణాలపై ఆధారపడుతుండటం ఒకవైపు, ఆదాయ వనరులు పెరగకపోవడం మరోవైపు - ఈ రెండు కలిసి రాష్ట్రాన్ని ఆర్థిక గాడి తప్పిస్తున్నాయి.

బడ్జెట్ గణాంకాలను పరిశీలిస్తే, 202526 సంవత్సరానికి ఆదాయ లోటు రూ.33,186 కోట్లుగా అంచనా వేశారు. కానీ ఏప్రిల్ నుంచి జూలై వరకు నాలుగు నెలల్లోనే ఈ లోటు రూ.36,741 కోట్లకు చేరుకుంది - అంటే 110 శాతం మించిపోయింది. ఇదే విధంగా, ద్రవ్య లోటు అంచనా రూ.79,927 కోట్లు (జీఎస్‌డీపీలో 4.4 శాతం) కాగా, నాలుగు నెలల్లోనే రూ.48,354 కోట్లు నమోదైంది, ఇది 60 శాతం. రాష్ట్రానికి వచ్చిన మొత్తం ఆదాయం రూ.98,281 కోట్లు, అందులో సగం - రూ.49,198 కోట్లు - రుణాల ద్వారానే సమకూరింది. నెలకు సగటున రూ.12,300 కోట్లు అప్పు చేయడం అంటే, రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలు పూర్తిగా రుణాలపైనే ఆధారపడుతున్నట్టు. ఖర్చుల విషయానికి వస్తే, వార్షిక అంచనా రూ.2.91 లక్షల కోట్లు కాగా, నాలుగు నెలల్లోనే రూ.94,374 కోట్లు వెచ్చించారు. ఈ ఖర్చుల్లో



అభివృద్ధి కార్యక్రమాల కంటే సాధారణ నిర్వహణ ఖర్చులు - పెన్షన్లు, జీతాలు, వడ్డీలు - ఎక్కువ భాగం తినేస్తున్నాయి.

గత సంవత్సరాల డేటా చూస్తే ఈ సమస్యలు కొత్తవి కావు. 202425లో సవరించిన అంచనాల ప్రకారం, ఆదాయ లోటు రూ.48,311 కోట్లు (జీఎస్‌డీపీలో 3 శాతం), ద్రవ్య లోటు రూ.73,362 కోట్లు (4.6 శాతం). 202324లో వాస్తవ లోటు రూ.38,683 కోట్లు (2.7 శాతం)గా ఉంది. నిటి ఆయోగ్ ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్ 2025లో ఆంధ్రప్రదేశ్ 18 రాష్ట్రాల్లో 17వ స్థానంలో ఉంది, ఇది రాష్ట్ర ఆర్థిక ఒత్తిడిని సూచిస్తుంది. రుణాలుజీఎస్‌డీపీ నిష్పత్తి 202223లో 32.5 శాతం, 202526 చివరికి 35 శాతానికి చేరుకోవచ్చు. ఆఫ్‌బడ్జెట్ బాధ్యతలు రూ.6.3 లక్షల కోట్లు మించి, మొత్తం రుణాలు రూ.11.2 లక్షల కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. స్వంత ఆదాయ వృద్ధి రేటు 2018 19లో 17 శాతం నుంచి 202223లో 10 శాతానికి పడిపోయింది, కమిటెడ్ ఖర్చులు ఆదాయంలో 65 శాతం వరకు చేరాయి.

ఈ పరిస్థితికి కారణాలు బహుముఖాలు. ఒకటి, సంక్షేమ పథకాలపై అత్యధిక ఖర్చు. 202526 బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సంక్షేమానికి రూ.52,047 కోట్లు (35 శాతం పెరుగుదల), ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌కు రూ.19,899 కోట్లు కేటాయించారు. విద్యకు రూ.35,213 కోట్లు, ఆరోగ్యానికి రూ.19,589 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.18,140 కోట్లు, నీటిపారుదలకు రూ.16,490 కోట్లు - ఇవి పెద్ద మొత్తాలే, కానీ వీటి అమలు సమర్థత ప్రశ్నార్థకం. ప్రతిపక్షాలు, ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ నేత జగన్, ఈ ఆర్థిక ఒత్తిడిని తీవ్రంగా విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వాల ఆర్థిక నిర్వహణలో క్రమశిక్షణ లోపం, అభివృద్ధి పేరిట అప్పులు తీసుకుని సరిగా వినియోగించకపోవడం వల్ల ఖజానా దిగజారిందని ఆరోపిస్తున్నారు. నిజానికి, 201823 మధ్య సామాజిక, ఆర్థిక సేవలపై క్యాపిటల్ ఖర్చు 84 శాతం, 60 శాతం తగ్గింది - ఇది అభివృద్ధి పనులు నిలిచిపోయినట్టు సూచిస్తుంది.

ప్రభుత్వం మాత్రం తమ సమర్థనలో, సంక్షేమం, అభివృద్ధి కొనసాగించడానికి రుణాలు అనివార్యమని చెబుతోంది. కానీ ఈ వాదనలో బలహీనత ఉంది. రుణాలు తీసుకుని వడ్డీలు చెల్లించడం కొనసాగితే, అభివృద్ధి నిధులు అప్పు తిరిగి చెల్లింపులకే వెళ్లిపోతాయి. పన్నుల వసూళ్లు పెంచకపోతే, భవిష్యత్తులో రాష్ట్రం మరిన్ని అప్పులపై ఆధారపడాల్సి వస్తుంది. నిటి ఆయోగ్ నివేదిక ప్రకారం, రుణ వృద్ధి, పెరుగుతున్న వడ్డీ చెల్లింపులు ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయి. రాష్ట్ర రుణాలు జీఎస్‌డీపీలో 35 శాతానికి చేరుతున్న నేపథ్యంలో, కేంద్రం అనుమతించే 3 శాతం ద్రవ్య లోటు పరిమితిని మించకుండా ఉండాలి. అదనంగా, పవర్ సెక్టర్ సంస్కరణలకు 0.5 శాతం అదనపు రుణాలు, 50 ఏళ్ల వడ్డీ రహిత లోన్లు ఉన్నాయి - వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

రాబోయే నెలలు రాష్ట్రానికి కీలకం. ఆదాయ వసూళ్లు - ముఖ్యంగా స్వంత పన్నులు, జీఎస్టీ - గణనీయంగా పెరగకపోతే, లోటు మరింత పెరిగి ఆర్థిక క్షీణత ఏర్పడవచ్చు. నిపుణులు హెచ్చరిస్తున్నట్టు, ఈ వేగంతో కొనసాగితే ఏడాది చివరికి లోటు రెట్టింపు కావచ్చు. ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటించాలి: కమిటెడ్ ఖర్చులను నియంత్రించడం, ఆదాయ వనరులను విస్తరించడం, అభివృద్ధి పనులపై దృష్టి పెట్టడం అవసరం. లేకపోతే, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక స్థిరత్వం మరింత ప్రమాదంలో పడుతుంది. ఇది కేవలం గణాంకాల సమస్య కాదు - రాష్ట్ర ప్రజల భవిష్యత్తును ప్రభావితం చేసే విషయం.

**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**

## ఇండియన్ జేమ్స్ బాండ్.. పాక్‌లో ఆరేళ్ల రహస్య జీవితం..

జేమ్స్ బాండ్.. హాలీవుడ్ సినిమాలు చూసే వారికి పరిచయం అవసరం లేని పేరు. ఈ జేమ్స్ బాండ్ పాత్రకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఉంది. అచ్చం ఇలాంటిదే ఓ పాత్ర రియల్ లైఫ్‌లో కూడా ఉంది. నిజం అండీ బాబు. అది మరెక్కడో కాదు.. మన దేశంలోనే. ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం.. ఇంతకీ ఆ జేమ్స్ బాండ్ ఎవరని ఆలోచిస్తున్నారా? వాస్తవంగా దేశ ప్రజలందరికీ ఆయనో రియల్ సూపర్ హీరో. అంతగా అభిమానిస్తారు ఈ దేశ ప్రజలు ఆయన్ని. తన ప్రాణాలకు ఎంతో రిస్క్ ఉన్నా సరే పాక్‌లో ఆరేళ్లు రహస్యంగా ఉండి విలువైన సమాచారాన్ని దేశానికి అందించారు. ఇంతకీ ఈ రియల్ సూర్ హీరో ఎవరూ, ఆయన దేశానికి చేసిన సేవ ఎంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం..

**'అజిత్ దోవల్- ఆన్ ఎ మిషన్'**

డి దేవదత్ రాసిన 'అజిత్ దోవల్ ఆన్ ఎ మిషన్' పుస్తకం బయటికి వచ్చిన తర్వాత అప్పటి వరకు దేశ ప్రజలకు హీరోగా ఉన్న ఓ వ్యక్తి ఆ తర్వాత సూపర్ హీరో అయిపోయారు. ఆయన మరేవరో కాదు.. ఇండియన్ జేమ్స్ బాండ్ అని దేశ ప్రజలు ముద్దుగా పిలుచుకునే జాతీయ భద్రతా సలహాదారు(NSA) అజిత్ దోవల్. ఆయన తన జీవితంలో అనేక ఇంపాజిబుల్ అనే మిషన్స్‌లో పాల్గొని ప్రాణాలకు తెగించి పని చేశారు. అలాంటి ఎన్నో మిషన్స్ గురించి దేవదత్ రాసిన పుస్తకంలో ఉన్నాయి.

అది 1974 లో భారతదేశం తన మొదటి అణు పరీక్షను నిర్వహించిన సమయం.. భారత్ చర్యతో ప్రపంచంతో పాటు పాకిస్థాన్ షాక్ అయ్యాయి. తర్వాత పాక్, చైనా - ఉత్తర కొరియా మద్దతుతో అణు సామర్థ్యాలను అన్వేషించడం ప్రారంభించింది. దీంతో ఇండియా ఈ రహస్యాన్ని తెలుసుకోడానికి ఒకరిని నియమించింది. ఆయనే ఇండియాన్ సూపర్‌కాప్ అని పిలువబడే అజిత్ దోవల్. ఇండియా ఈ మిషన్‌ను ఆయనకు అప్పగించింది. ఈ మిషన్ నిజంగా ఆయన ప్రాణాలకు ఎంతో ప్రమాదం ఉన్న మిషన్, పొరపాటున ఎక్కడైన నిజం బయటపడితే, ఆయన ప్రాణాలతో పాటు దేశ భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది. మొత్తానికి ఆయన ఏం చేశారనేది తెలుసుకుందాం..



# ఓటుకు నోటు దొంగ రేవంత్ రెడ్డి


- **కాంగ్రెస్ పార్టీ అంటేనే దొంగల పార్టీ**
- **పీసీసీ చీఫ్‌పై మానకొండూరు బీజేపీ నేతలు మండిపాటు**
- **మహేశ్ కుమార్ గౌడ్ దిష్టిబొమ్మ దగ్ధం**

**జర్నలిస్ట్ డైరీ, మానకొండూర్(ఆగస్ట్ 25):**



రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌పై మానకొండూర్ బీజేపీ నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ వరంగల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే దొంగల పార్టీ అని, ఓటుకు నోటు దొంగ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని విమర్శించారు. బండి సంజయ్ కుమార్‌ను విమర్శిస్తే సహించేది లేదని, వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు.

జనాలు లేని యాత్ర జనహిత యాత్ర అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, రంగు భాస్కరాచారి, మాజీ మండల అధ్యక్షు లు రాపాక ప్రవీణ్, నాయకులు వంగల ఆంజనేయులు, ఎదులాపురం అశ్విన్ తేజ, భాషబోయిన ప్రదీప్ యాదవ్, గాడిచర్ల భూమయ్య, మాచర్ల కోటేశ్వర్,ఆరెల్లి శ్రీహరి, తాడూరి కిరణ్ రెడ్డి, ఆరెపల్లి సునంద్ కుమార్, మార్కొండ రమేష్ పటేల్, నందగిరి బలరాం, కోండ్ర సురేష్, బండారి హరీష్ కుమార్, కోమ్మ అనిల్ యాదవ్, తాళ్ల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.




# ఫీజుల పెంపా?కుదింపా?

**మొదటిపేజీ తరువాయి**

కమిటీని వే సింది. ఈ కమిటీ సూచనల మేరకు కాలేజీల ఫీజుల వ్యవహారాన్ని మరోసారి ఎఫ్‌ఆర్‌సీ విచారిస్తోంది.

**ప్రైవేటు కాలేజీలకు టెన్షన్**

కాలేజీల్లో నాణ్యత ప్రమాణాలను కొత్తగా మార్గదర్శకాలుగా తీసుకుంటున్నారు. ఇందుకు జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులు ఉన్న కాలేజీలను గుర్తించాల్సి ఉంటుంది. దీనిపై కాలేజీ యాజమాన్యాల్లో గుబులు మొదలైంది. కొన్ని కాలేజీలకు జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులు ఉన్నా గతంలో ఎప్పుడూ ఫీజుల పెంపునకు వీటిని కొలమానంగా తీసుకోలేదు. ఈ ర్యాంకులు లేకున్నా, తక్కువ స్థాయిలో ఉన్నా నిర్ణీత ఫీజుకు కత్తెర కూడా వేసే అవకాశం ఉందని యాజమాన్యాలు భయపడుతున్నాయి. కొన్ని కాలేజీలు న్యాక్ ర్యాంకు కోసం కూడా ప్రయత్నించలేదు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు టాప్ కాలేజీలకు మాత్రమే వస్తున్నాయని యాజమాన్యాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలో పెద్ద కాలేజీలకే న్యా యం జరుగుతుందని, చిన్న కాలేజీలు నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

**ఆడిట్ లెక్కలపై సందేహాలు**

గత మూడేళ్ల జమా ఖర్చులను కాలేజీలు ఎఫ్‌ఆర్‌సీకి ఇప్పటికే సమర్పించాయి. వీటిని ఆడిట్ విభాగాలు పరిశీలించాయి. అయితే, కాలేజీల్లో ఆడిట్ చేసినవారితో ఎఫ్‌ఆర్‌సీ ఆడిటర్లకు సంబంధాలున్నాయని, ఇప్పుడు వారిని మార్చే అవకా శం ఉందని చెబుతున్నారు. మౌలిక వసతులకు చే సిన ఖర్చు, ఫ్యాకల్టీకి చెల్లించిన వేతనాలు డిజిటల్ విధానంలో చూపించాలని ఎఫ్‌ఆర్‌సీ కోరే అవ కాశం ఉంది.

అయితే దాదా పు 85 కాలేజీల వద్ద ఇలాంటి ఆధారాలు లేవని సమాచారం. దీంతో ఈ కాలేజీల ఫీజుల్లో కోత పడుతుందా? అనే సందేహాలు యాజమాన్యాల్లో కలుగుతున్నాయి. ప్లేస్‌మెంట్లను కూడా ఫీజుల పెంపునకు కొల మానంగా తీసుకోబోతున్నారని తెలిసింది.

అయితే, కొన్నేళ్లుగా కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించడం లేదు. ఆఫ్ క్యాంపస్ నియామకాలే జరుగుతున్నాయి. పెద్ద కాలేజీల్లో విద్యార్థు లు క్యాంపస్ ఉద్యోగాలకు ప్రయత్నించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని ఎంతవరకు పరిగణనలోనికి తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

**భవిష్యత్ కార్యాచరణపై కాలేజీల కసరత్తు**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎఫ్‌ఆర్‌సీ ముందు హాజరైనా.. భవిష్యత్ కార్యాచరణపై ఉమ్మడిగా ఒక నిర్ణయం తీసుకోవాలని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు భావిస్తున్నాయి. షెడ్యూల్ ప్రకారం మొదటి వారం రోజులు ఎఫ్‌ఆర్‌సీ ముందు హాజరయ్యే వాటిల్లో ఒక మోస్తరు కాలేజీలున్నాయి. వీటి పట్ల కమిటీ ఎలా వ్యవహరిస్తుంది? ఏయే అంశాలను పరిగణనలోనికి తీసుకుంటుంది? ఫీజులు పెంచుతారా? తగ్గిస్తారా? అనే అంశాలను పరిశీలించాలని నిర్ణయించాయి. దీని ఆధారంగా వచ్చేవారం సమావేశమై చర్చించాలని నిర్ణయించినట్టు ఓ కాలేజీ ప్రతినిధి తెలిపారు. అవసరమైతే న్యాయ పోరాటం చేయడమా? ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమా? ఏదీ కాకపోతే సమ్మెకు వెళ్లడమా? అనే అంశాలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

# విద్యార్థిపై లాఠీ పడితే.. తెలంగాణ సమాజం ఊరుకోదు

- **పోలీసు బలం, బలగంతో విద్యార్థుల నిరసన జ్వాలలను చల్లార్చలేరు**
- **ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల అరెస్ట్ అప్రజాస్వామికం**
- **అరెస్ట్ చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి**
- **మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

సీఎం రేవంత్ ఉస్మానియా యూనివర్సిటీ పర్యటన నేపథ్యంలో విద్యార్థులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజంపై నిషేధాజ్ఞలు విధిస్తారా అని ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నదని చెప్పారు కేసీఆర్ హయాంలో ఓయూలో శంకుస్థాపన చేసిన నిర్మాణాలను ప్రారంభించడం తప్ప 22 నెలలుగా రేవంత్ రెడ్డి చేసిందేముందన్నారు. జాబ్‌క్యాలెండర్‌ను జాబ్ లెస్ క్యాలెండర్ చేశారని మండిపడ్డారు. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీకి వస్తున్న సందర్భంగా విద్యార్థులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామిక, పిరికిపంద చర్య. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఒక్క విద్యార్థి మీద పోలీసు లాఠీ పడినా తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరిస్తున్నాం. ఇందుకేనా విద్యాశాఖను, హోం శాఖను మీ వద్ద పెట్టుకున్నది. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నది. మొత్తం తెలంగాణ సమాజం మీద నిషేధాజ్ఞలు విధిస్తారా?. ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్య పాలన అని చెప్పి, ఎమర్జెన్సీ రోజులను తిరిగి తెచ్చిండు రేవంత్ రెడ్డి. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇవ్వడం. కేసీఆర్ హయాంలో ఓయూలో శంకుస్థాపన చేసిన నిర్మాణాలను ప్రారంభించడం తప్ప 22 నెలలుగా నువ్వు చేసింది ఏముంది రేవంత్ రెడ్డి?. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ చేసారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలని మోసం చేసారు. నిరుద్యోగ భృతి పేరిట నయవంచన చేసారు. 22నెలల్లో 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా 60వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నావు. నీ తప్పుడు ప్రచారంపై కడుపు మండిన విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నవు. నెలల తరబడి విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటే నువ్వు ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలం వెళ్లదీస్తున్నవు. గ్రంథాలయాల్లో పోలీసు లాఠీ చార్జీలు జరిపించిన అరాచక చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది. విద్యార్థులు, నిరుద్యోగుల వీపులు పగుల గొట్టిన అమానుష పాలన కాంగ్రెస్ ప్రభుత్వానిది. ఆంక్షలతో, నిషేధాలతో నిరుద్యోగుల హృదయాల్లో రగులుతున్న నిరసన జ్వాలలను చల్లార్చలేరు. ఇనుప కంచెలు, బ్యారికెడ్లతో ప్రజా తిరుగుబాటును ఆపలేరు. పోలీసు బలం, బలగంతో విద్యార్థుల నిరసన జ్వాలలను చల్లార్చలేరు. ఉస్మానియా విద్యార్థి, నిరుద్యోగులు సింహాలై గర్జిస్తరు. ఉద్యోగాల పేరిట మీరు చేసిన మోసాన్ని ఎక్కడిక్కడ నిలదీస్తరు. మోసం చేసినందుకు ఉస్మానియా సాక్షిగా విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.' అని హరీశ్ రావు అన్నారు.

# న్యూ దిల్‌సుఖ్ నగర్‌లో వివాహిత అదృశ్యం

**జర్నలిస్ట్ డైరీ, న్యూ దిల్ సుఖ్ నగర్(ఆగస్ట్ 25):**



న్యూ దిల్ సుఖ్ నగర్‌లోని వికాస్ నగర్‌లో నివసించే వివాహిత బాచలపురి మహేశ్వరి(22) అదృశ్యమైన కేసు చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో నమోదయ్యింది. వివిధ ఇళ్లలో పనిమనిషిగా పని చేస్తున్న ఆమె.. ఆదివారం ఉదయం 05:30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లినట్టుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. భర్త ఇంటిలో లేని సమయంలో ఆమె వెళ్లినట్టుగా తెలిపారు. రాత్రి ఏడున్నర సమయంలో మహేశ్వరి ఇంట్లో లేదని గుర్తించారు. చుట్టుపక్కల వెతకగా కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులు, భర్త తెలిపిన వివరాల ప్రకారం ఆమె మొబైల్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. ఆమె ఆచూకీ తెలిస్తే.. ఫిర్యాదుదారు 8374450146, చైతన్యపురి ఎస్‌హెచ్ఓ 8712662305, ఎస్ఐ వి. ప్రభాకర్ 8712578827 కు తెలియజేయగలరు.




# రాజకీయాల్లో విజయానికి వ్యూహమే అసలు ఆయుధం

- **పవర్ ప్లే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కేటీఆర్**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్(ఆగస్టు 25):**



రాజకీయాల్లో విజయానికి వ్యూహం అత్యంత కీలకమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నగరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో "పవర్ ప్లే" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "రాజకీయాలు కేవలం ప్రసంగాలు లేదా ప్రచార యాత్రలతో మాత్రమే గెలవలేం. ఒక నాయకుడు గెలవాలంటే సరైన వ్యూహం ఉండాలి. పార్టీ బలపడాలంటే క్రమశిక్షణ, ప్రణాళిక, నాయకత్వం అవసరం. ఈ పుస్తకం ఆ మార్గదర్శనం ఇస్తుందనడం ఆనందంగా ఉంది. భవిష్యత్తులో మరెందరో యువ నాయకులు ఈ పుస్తకం ద్వారా నేర్చుకుని విజయాలను సాధిస్తారని నాకు నమ్మకం ఉంది" అని అన్నారు.

అనంతరం "పవర్ ప్లే" పుస్తక రచయిత రమాకాంత్ మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా తాను తెర వెనుక రాజకీయ వ్యూహకర్తగా అనేక మంది జాతీయ, రాష్ట్ర నాయకులతో కలిసి పని చేశానన్నారు. ఆ అనుభవం, సీనియర్ నాయకుల సూచనలు, మేధావుల సలహాలను కలిపి ఈ పుస్తకాన్ని రాశానని తెలిపారు. ఇది రాజకీయ వ్యూహం, నాయకత్వం, ఎన్నికల ప్రచారంపై తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌లో ఒకేసారి వచ్చిన భారతదేశంలోని తొలి పుస్తకమన్నారు. బూత్ స్థాయి కార్యకర్త నుండి రాష్ట్ర స్థాయి నాయకుడి వరకు, అలాగే వ్యూహకర్తగా ఎదగాలనుకునే వారికి ఇది తప్పనిసరిగా ఉపయోగపడుతుందని తెలిపారు. రాజకీయాల్లో తిరుగుతూ చాలా మంది యువకులు డబ్బు, సమయం, శ్రమ ఖర్చు చేస్తున్నారన్నారు. కానీ సరైన దిశ లేకపోతే ఆ శ్రమ వృథా అవుతుందన్నారు. అందుకే ఈ పుస్తకంలో ఒక కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి నాయకుడు తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన 70కి పైగా ముఖ్యమైన అంశాలను చేర్చానన్నారు. వ్యూహకర్తగా వృత్తిని ఎంచుకోవాలనుకునే వారికి ఇది ఒక గైడ్‌బుక్‌లా పనిచేస్తుందన్నారు. అంతేకాకుండా తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌లో వీడియో కోర్స్ రూపంలో కూడా అందుబాటులో ఉందన్నారు. తన నమ్మకం ఒక్కటే - సరైన వ్యూహం అంటే అర్ధ విజయమేనని, ఈ పుస్తకం, ఈ కోర్స్ యువత విజయానికి దారి చూపుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వేముల ప్రశాంత్ రెడ్డి, టీఎస్ రెడ్కో మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి పాల్గొని రచయితను అభినందించారు.


# సంగారెడ్డిలో 129 కిలోల ఎండు గంజాయి పట్టివేత!

**జర్నలిస్ట్ డైరీ, సంగారెడ్డి:**



సంగారెడ్డిలో భారీ ఎత్తున ఎండు గంజాయి పట్టుబడింది. జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసులు సంయుక్తంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు కార్లలో 129 కిలోల ఎండు గంజాయిని గుర్తించినట్లు ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ తెలిపారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కారులో ప్రత్యేకంగా తయారు చేసిన క్యాబిన్‌లో గంజాయిని దాచి ఒడిశా నుంచి మహారాష్ట్రకి తరలిస్తుండగా వారిని పట్టుకున్నట్లు చెప్పారు. దొరికిన గంజాయి విలువ రూ.40లక్షలు ఉంటుందన్నారు.

"గతంలో వీరిపై మన రాష్ట్రంలో కేసులు లేవు. గంజాయి తరలింపులో వీళ్లు ఒక్కోసారి ఒక్కో రూట్‌లో వెళ్తుంటారు. ఈసారి జాతీయ రహదారి 161 మీదుగా వెళ్తున్నారన్న సమాచారం ఆధారంగా వీరిని పట్టుకున్నాం. కాల్‌డేటా ద్వారా గంజాయి ఎవరు తెప్పిస్తున్నారో కనుక్కుంటాం. చివరి 6 నెలల్లో 80 కేసులు నమోదు చేశాం. ఇప్పటివరకు 280 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నాం"అని హరికిషన్ వివరించారు.









# కట్ చేసి పడేశారు!

- **సంవత్సరాలు తరబడి కరెంట్ స్తంభాలకు ఉన్న తీగలు**
- **విద్యుత్ శాఖ ఏడీ, ఏఈ సమక్షంలో తొలగించిన లైన్మెన్లు**
- **నెట్ వర్క్ లేక తీవ్ర ఇబ్బందులు పడ్డ వినియోగదారులు**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో-(ఆగస్టు 25):**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ముఖ్య కూడలిలో ఈ రోజు ఎన్నో సంవత్సరాలు తరబడి స్తంభాలకు వేలాడుతున్న తీగలను విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించారు. ఇంత పెద్ద ఎత్తున తీగలు కట్ చేయడంతో కేబుల్ సంస్థలు, టెలికాం యజమానులు తీవ్ర గందరగోళ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని అన్ని కాలనీలో కేబుల్ నెట్ వర్క్, ఇంటర్నెట్ సరఫరా ఒక్కసారిగా ఆగిపోయింది. యజమానులకు సమాచారం ఇవ్వకుండా ఒక్కసారిగా తీగలు కట్ చేయడంలో అంతరాయం ఏమిటో అర్థం కాని పరిస్థితి. తమ జీవితాలు పణంగా పెట్టి నడిపిస్తున్నట్టి సంస్థలకు ఒక్కసారిగా గట్టి దెబ్బ అని చెప్పవచ్చు. మా పై దయ ఉంచి ఒక్కసారి ఆలోచించండి అని కేబుల్ నెట్వర్క్, టెలికం యజమానులు ప్రాధేయాపడుతున్నారు.




# రెస్క్యూ శిక్షణ పొందిన ఉద్యోగులకు సర్టిఫికెట్ల పంపిణీ

**జర్నలిస్ట్ డైరీ, యైటింక్లయిన్ కాలనీ(ఆగస్టు 25):**




సింగరేణి రామగుండం రీజియన్ రెస్క్యూ స్టేషన్ లో సోమవారం రెస్క్యూ శిక్షణ ముగింపు సమావేశం జరిగింది. సాయంత్రం జరిగిన ముగింపు సమావేశంలో విశిష్ట అతిధులుగా ఏరియా జనరల్ మేనేజర్ బి. వెంకటయ్య, రెస్క్యూ స్టేషన్ జనరల్ మేనేజర్ కే శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొనగా, సింగరేణి కార్పొరేట్ సాయి జనరల్ మేనేజర్ కో ఆడినేషన్ ఎస్. డి.ఎం. సుభాని ముఖ్య అతిథిగా హాజరై, ఇక్కడి రెస్క్యూ స్టేషన్ లో ఇనిషియల్ రెస్క్యూ లో రెండు వారాల పాటు శిక్షణ పూర్తి చేసుకొన్న 193వ బ్యాచ్ ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేట్ జిఎం సుభాని మాట్లాడుతూ..యువ ఉద్యోగులు రెస్క్యూ శిక్షణ ద్వారా అత్యవసర పరిస్థితులల్లో, పని చేసే విధంగా నైపుణ్యత సాధించడం జరిగిందన్నారు. రెండు వారాలపాటు పొందిన ఈ శిక్షణ విధినిర్వహణలో ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఇక ఈ సందర్భంగా ఈ నెల ఆఖరున పదవి విరమణ పొందుతున్న జీఎం సుభానిని ఏరియా, రెస్క్యూ విభాగం జీఎం లు, స్టేషన్ సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, డా.రాజేశ్వర్ రావ్, లు శాలువా కప్పి బోకేను అందించి ఆత్మీయంగా సన్మానించారు. ఇంకా ఈ ముగింపు సమావేశంలో స్టేషన్ ఇన్స్పెక్టర్ తిరుపతి, రెస్క్యూ సిబ్బంది, శిక్షణ పూర్తి చేసుకొన్న యువ ఉద్యోగులు పాల్గొన్నారు.



# కాయకష్టం మర్చిపోయేది ఇక్కడే!

**జర్నలిస్ట్ డైరీ, ఎల్బీ నగర్(ఆగస్ట్ 25):**

తెల్లారి లేచి.. ఊరును అందంగా, మురిపెంగా మార్చే తల్లులు వీళ్లు. వారి కష్టం మర్చిపోయేది ఇక్కడే. నాలుగు మెతుకులు నోట్లో పెట్టుకుంటూ.. నాలుగు మాటలు పంచుకుంటూ సరదాగా కాలక్షేపం చేసిది ఆ భోజనాల దగ్గరే. కసువు ఎత్తే చేతులను.. కాలనీలను పరిశుభ్రం చేసే మనుషులను చూసిన ఆ క్షణం 'జర్నలిస్ట్ డైరీ' తన కెమేరాతో క్లిక్ మనిపించింది. ఎల్బీ నగర్‌లోని శివగంగా కాలనీలో జీహెచ్ఎంసీ కార్మికులు మధ్యాహ్న భోజనం చేస్తుండగా తీసిన ఫోటో ఇది.



## రైతులకు ఎరువుల కొరత రానివ్వను.. మంత్రి హామీ!

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతులకు ఎరువుల కొరత ఉండదని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. 2025 ఖరీఫ్ కోసం 31.15 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేశామని.. అందులో ఇప్పటివరకు 21.34 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేశామని ఆయన తాజాగా విలేకర్ల సమావేశంలో అన్నారు. యూరియా, డీఏపీ, ఎంఓపీ, ఎస్ఎస్పీ, కాంప్లెక్స్ కలిపి 6.22 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని.. ఎరువుల కొరత రాకుండా 1.10 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. గోదావరి వరదలతో సమస్యలు తలెత్తినా, ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని ఆయన ఈ సందర్భంగా తెలియ చేశారు. కేంద్రం ఇప్పటి వరకు 3.50 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, 1.30 లక్షల మెట్రిక్ టన్నులు చేరాయని.. మరో 0.47 లక్షల మెట్రిక్ టన్నులు త్వరలో రాబోతున్నాయని మంత్రి తెలిపారు. ఆగస్టు నెలలో 1.65 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా.. అందులో 0.75 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే రాష్ట్రానికి చేరాయని.. మిగిలిన 0.90 లక్షల మెట్రిక్ టన్నులు గంగవరం, కాకినాడ, విశాఖపట్నం, ఒరిస్సా పోర్టుల ద్వారా త్వరలో చేరనున్నాయని ఆయన తెలిపారు.

రైతులకు ఎరువులు పారదర్శకంగా, సమయానికి అందించేందుకు iFMS ద్వారా పర్యవేక్షణ జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 6.48 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని.. రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని మంత్రి అన్నారు. మధ్యవర్తులు అధిక ధరలకు అమ్మే ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. నల్లబియ్యం, అరటి, చెరకు వంటి ప్రత్యేక పంటలకు ఎరువుల సరఫరా కోసం ప్రత్యేకంగా పర్యవేక్షణ జరుగుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.



## నక్సలైట్లు పేరుతో గిరిజనుల్ని చంపుతున్నారు!

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ప్రకాశం జిల్లాలో ప్రకటించిన సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అనేక విషయాలపై మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సురవరం సుధాకర్ రెడ్డి మరణం తీరని లోటని అన్నారు. ప్రజా సమస్యలపై సుధాకర్ రెడ్డి జీవితాంతం పోరాటం చేశారని ఆయన గుర్తు చేశారు. ఇక ఉపరాష్ట్రపతి పదవికి జగదీష్ ధన్కర్ ఎందుకు రాజీనామా చేశారో ఎవరికీ తెలియదంటూనే.. ఆయన రాజీనామా వెనుక రాజకీయ వత్తిడిలు ఉన్నాయన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలో జస్టిస్ సుదర్శన్ రెడ్డికి సీపీఐ మద్దతు ప్రకటించామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి ని ఉపరాష్ట్రపతిగా ఎన్నుకోవాలని కోరుతున్నామన్నారు.

జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని అన్నారు. భారత్ - పాక్ యుద్ధం ఆపానని ట్రంప్ చెబుతున్నారని.. యుద్ధం ఎవరు ఆపారో ప్రధాని మోడీ నోరు విప్పి చెప్పడం లేదన్నారు. భారత్ పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్ వార్ ప్రకటించారని.. రష్యా నుండి ఆయిల్ కొనుగోలు చెయ్యవద్దని భారత్ కి ట్రంప్ ఎలా చెబుతారని ఆయన మండిపడ్డారు. ప్రత్యర్థి పార్టీలే టార్గెట్ గా ఈడి, ఐటిలను బీజేపీ వాడుతుందని.. దేశంలో ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరగాలని ఆయన అన్నారు. అయితే, బీహార్ లో అలాంటి పరిస్థితులు లేవని.. బీహార్ లో ఎన్నికల కమిషన్ విధుల్లో ఫెయిల్ అయ్యిందని మండిపడ్డారు.

రాబోయే రోజుల్లో కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఎన్నికలు జరగాల్సి ఉందని.. దేశంలో ప్రధాని మోడీ పాత్రని ఆర్ఎస్ఎస్ పోషిస్తుందని దుయ్యబట్టారు. ఇంకా రాష్ట్రంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా సీపీఐ పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. నక్సలైట్లు పేరుతో గిరిజనుల్ని అమిత్ షా చంపుతున్నారని.. అటవీ భూమిల్ని కార్పోరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే గిరిజన ప్రజల్ని చంపుతున్నారని ఆయన మండిపడ్డారు.



## ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో ఇక సంప్రదాయ దుస్తులు తప్పనిసరి!

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

విజయవాడలోని ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో భక్తుల కోసం కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. సెప్టెంబర్ 27 నుంచి భక్తులు తప్పనిసరిగా సంప్రదాయ దుస్తులు ధరించాలి. ఒకవేళ సంప్రదాయ దుస్తులు లేకపోతే ఆలయంలోకి ప్రవేశం ఇవ్వబోమని ఆలయ అధికారులు స్పష్టం చేశారు. అదే విధంగా, ఆలయంలో సెల్‌ఫోన్ వాడకంపై నిషేధం విధించారు.

ఇటీవల భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించకపోవడం, అంతరాలయంలో వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడం వంటి ఘటనలు గుర్తించడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఆలయ సాంప్రదాయాలకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. అంతేకాకుండా, ప్రోటోకాల్ దర్శనాలకు వచ్చే వారు ఆలయ ఆఫీసులోనే ఫోన్లు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. భక్తులు, ఉద్యోగులందరూ సాంప్రదాయ దుస్తులు ధరించడం ఇకపై తప్పనిసరి కానుంది. ఆలయ సిబ్బంది తప్పనిసరిగా ఐడీ కార్డులు ధరించాలని.. అలాగే స్కానింగ్ పాయింట్, టికెట్ కౌంటర్ వద్ద కఠిన తనిఖీలు జరగనున్నాయని అధికారులు తెలిపారు. ఇకపై డ్రెస్ కోడ్ లేకపోయినా, సెల్‌ఫోన్ తీసుకవచ్చే వారిని ఆలయంలోకి అనుమతి ఉండదని అధికారులు స్పష్టం చేశారు.

# శుభవార్త.. ఖాతాల్లో తల్లికి వందనం సొమ్ము..!

- తల్లికి వందనం పథకంపై శుభవార్త..
- పెండింగ్ దరఖాస్తులకు మంత్రి నారా లోకేష్ ఆమోదం..
- రూ.325 కోట్లు రిలీజ్ కు అనుమతి..
- త్వరలోనే విద్యార్థుల తల్లుల ఖాతాల్లో సొమ్ము జమ..




తల్లికి వందనం పథకంపై శుభవార్త చెప్పింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. ఏపీలో తల్లికి వందనం పథకం పెండింగ్ దరఖాస్తులకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆమోదం తెలిపారు.. విద్యా శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించిన లోకేష్.. పథకానికి సంబంధించి పెండింగ్ లో ఉన్న రూ.325 కోట్లు రిలీజ్ కు అనుమతి ఇచ్చారు.. దీంతో, త్వరలోనే విద్యార్థుల తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం పథకానికి సంబంధించిన సొమ్ము జమకానుంది.. మరోవైపు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను కూడా వెంటనే విడుదల చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్..

కాగా, ఏపీలోని కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద.. 1వ క్లాస్ నుంచి 12వ తరగతి (ఇంటర్) వరకు విద్యార్థుల తల్లులకు ఆర్థిక చేయూత అందిస్తోంది.. విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో ఈ డబ్బు జమ చేస్తున్న విషయం విదితమే.. ఒక్కో విద్యార్థికి ఈ పథకం కింద రూ.15 వేలు కేటాయిస్తున్న ప్రభుత్వం.. అందులో రూ. 13 వేలు తల్లుల ఖాతాల్లో జమ చేసి.. మిగిలిన రూ. 2 వేలు పాఠశాల నిర్వహణ గ్రాంట్ కోసం కలెక్టర్ల బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది.. దీంతో, ప్రతి విద్యార్థి తల్లికి రూ. 13 వేలు అందుతాయి. అంటే, ఇద్దరు పిల్లలున్న తల్లులకు రూ. 26 వేలు, ముగ్గురు పిల్లలున్న తల్లులకు రూ.39 వేలు.. ఇక, నలుగురు పిల్లలున్న తల్లులకు రూ. 52 వేలు.. వారి ఖాతాల్లో జమ చేసింది.. ఇప్పటికే ఈ పథకానికి సంబంధించిన సొమ్ము విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ అయ్యింది.. కానీ, కొన్ని కారణాల వల్ల, మరికొన్ని పెండింగ్‌లో పడ్డాయి.. అయితే, తల్లికి వందనం పథకం పెండింగ్ దరఖాస్తులకు మంత్రి నారా లోకేష్ ఆమోదం తెలిపారు.. విద్యా శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించిన లోకేష్.. పథకానికి సంబంధించి పెండింగ్ లో ఉన్న రూ.325 కోట్లు రిలీజ్ కు అనుమతి ఇచ్చారు.. దీంతో, త్వరలోనే విద్యార్థుల తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం పథకానికి సంబంధించిన సొమ్ము త్వరలోనే జమ కానుంది.

## ఇంటింటికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్...

- రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభం
- విజయవాడలో ఇంటింటికీ వెళ్లి కార్డులు అందజేసిన మంత్రి నాదెండ్ల మనోహర్
- మొత్తం 4.42 కోట్ల మంది లబ్ధిదారులకు కొత్త కార్డులు
- సెప్టెంబర్ 15 నాటికి పంపిణీ పూర్తి చేయాలని లక్ష్యం
- క్యూఆర్ కోడ్ స్కాన్‌తో పారదర్శకత, ఎక్కడైనా రేషన్ పొందే సౌకర్యం
- సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నంబర్ 1967 ఏర్పాటు

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

రాష్ట్రంలో కొత్తగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో ప్రారంభమైంది. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం విజయవాడ, పెనమలూరు ప్రాంతాల్లో స్వయంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు కార్డులను అందజేసి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4.42 కోట్ల మంది లబ్ధిదారులకు ఈ స్మార్ట్ కార్డులను అందించనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, సెప్టెంబర్ 15వ తేదీలోగా రాష్ట్రంలోని ప్రతి లబ్ధిదారుని ఇంటికి స్మార్ట్ కార్డును చేర్చేలా లక్ష్యం నిర్దేశించుకున్నామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో 5.90 లక్షల మందికి, కృష్ణా జిల్లాలో 5.17 లక్షల మందికి ఈ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ కొత్త కార్డుల ద్వారా లబ్ధిదారులు రాష్ట్రంలోని ఏ చౌకధరల దుకాణంలోనైనా రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు కలుగుతుందని స్పష్టం చేశారు.

ఈ స్మార్ట్ కార్డులో ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా లబ్ధిదారుడు ఎప్పుడు, ఎక్కడ సరుకులు తీసుకున్నాడనే సమాచారం నేరుగా ప్రభుత్వానికి చేరుతుందని, దీనివల్ల పంపిణీ వ్యవస్థలో పూర్తి పారదర్శకత సాధ్యమవుతుందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 29 వేల రేషన్ దుకాణాల ద్వారా ప్రజల అవసరాలకు అనుగుణంగా కందిపప్పు, పామాయిల్, గోధుమలు వంటివి సరఫరా చేస్తున్నామని, ఇందుకోసం పీఓఎస్ మిషన్లను కూడా అప్‌గ్రేడ్ చేశామని అన్నారు.

గిరిజన, మారుమూల ప్రాంతాల ప్రజల సౌకర్యం కోసం సబ్‌రేషన్ డిపోల ఏర్పాటుపై ముఖ్యమంత్రితో చర్చిస్తున్నట్లు తెలిపారు. కార్డులో పేర్ల మార్పులు, చేర్పుల కోసం స్థానిక గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఏవైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబర్ 1967కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడే ప్రసాద్, పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.





## వినాయక మండపాల నిర్వాహకులకు శుభవార్త చెప్పిన నారా లోకేశ్

- వినాయక, దసరా మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా
- మంత్రి నారా లోకేశ్ ప్రకటనతో నిర్వాహకులకు ఊరట
- ఉచిత విద్యుత్ ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు ఆమోదం
- ఈ పథకం కోసం రూ. 25 కోట్లు కేటాయించిన కూటమి ప్రభుత్వం
- త్వరలో అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయనున్న సర్కార్

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఆంధ్రప్రదేశ్‌లో వినాయక చవితి, దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించే మండపాల నిర్వాహకులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ పండుగల సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం వెల్లడించారు.

వినాయక ఉత్సవ సమితుల నుంచి తన దృష్టికి వచ్చిన వినతి మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో చర్చలు జరిపినట్లు లోకేశ్ తెలిపారు. ఈ చర్చల ఫలితంగా వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వం సంపూర్ణంగా అంగీకరించిందని ఆయన వివరించారు.

ఈ ప్రయోజనాన్ని కేవలం వినాయక చవితికే పరిమితం చేయకుండా, రాబోయే దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఏర్పాటు చేసే దుర్గా పందిళ్లకు కూడా వర్తింపజేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ రెండు ప్రధాన పండుగల కోసం ఉచిత విద్యుత్ అందించేందుకు కూటమి ప్రభుత్వం రూ. 25 కోట్లు వెచ్చించనుందని ఆయన వెల్లడించారు.

ఈ నిర్ణయానికి సంబంధించి ప్రభుత్వం త్వరలోనే అధికారిక ఉత్తర్వులు జారీ చేయనుందని లోకేశ్ పేర్కొన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది ఉత్సవ కమిటీలకు ఆర్థికంగా పెద్ద ఊరట లభించనుంది.

## కొన్ని ఛానళ్లు నాపై దుష్ప్రచారం చేస్తున్నాయి: మంత్రి సంధ్యారాణి

**జర్నలిస్ట్ డైరీ, అమరావతి:**

కొన్ని ఛానళ్లు తనపై దుష్ప్రచారం చేస్తున్నాయని ఏపీ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి (Sandhya Rani) మండిపడ్డారు. తన ఎదుగుదలకు ఓర్వలేక అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. ఆధారాలు చూపించలేకపోతే 24 గంటల్లో క్షమాపణ చెప్పాలని, లేదంటే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు.




## ఉచిత బస్సులకు త్వరలో లైవ్ ట్రాకింగ్... బోర్డులు ఏర్పాటు చేయాలి: సీఎం చంద్రబాబు

- ఆర్టీసీపై సమీక్షలో సీఎం చంద్రబాబు
- బస్సులకు ముందు, వెనుక వైపులా బోర్డులు పెట్టాలని సీఎం ఆదేశం
- పథకం విజయవంతం చేసిన మహిళలకు చంద్రబాబు ధన్యవాదాలు
- ఆర్టీసీలో 100 శాతానికి చేరిన ఆక్యుపెన్సీ రేషియో
- మహిళా ప్రయాణికుల శాతం 40 నుంచి 65 శాతానికి పెరుగుదల

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**




ఆంధ్రప్రదేశ్‌లో మహిళల కోసం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకానికి మరో కీలకమైన సాంకేతిక హంగు చేరనుంది. ఇకపై మహిళలు బస్టాపుల్లో బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండా, తమ స్మార్ట్‌ఫోన్లలోనే బస్సు ఎక్కడుందో తెలుసుకునేలా 'లైవ్ ట్రాకింగ్' వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు సచివాలయంలో ఆర్టీసీ పనితీరుపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ విధానం అమల్లోకి వస్తే, మహిళలు తమ ప్రయాణ సమయాన్ని కచ్చితంగా ప్లాన్ చేసుకోవడానికి వీలు కలుగుతుందని, ఇది వారి సమయాన్ని ఆదా చేయడమే కాకుండా భద్రతను కూడా పెంచుతుందని సీఎం అభిప్రాయపడ్డారు.

### ముందుగా గుంటూరులో పైలట్ ప్రాజెక్ట్

లైవ్ ట్రాకింగ్ విధానాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారని ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించగా, రాబోయే రెండు మూడు రోజుల్లోనే గుంటూరు డిపో పరిధిలో దీనిని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభిస్తామని ఆర్టీసీ అధికారులు బదులిచ్చారు. అక్కడి ఫలితాలను బట్టి, దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని స్త్రీ శక్తి బస్సులకు ఈ సదుపాయాన్ని విస్తరిస్తామని వారు ముఖ్యమంత్రికి వివరించారు. దీనితో పాటు, స్త్రీ శక్తి పథకం కింద నడుస్తున్న 8,458 బస్సులకు స్పష్టంగా కనిపించేలా ముందు, వెనుక భాగాల్లో ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలని కూడా సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు సంయమనంతో వ్యవహరించాలని ఆర్టీసీ సిబ్బందికి ఆయన సూచించారు.

### పథకం గ్రాండ్ సక్సెస్.. మహిళలకు సీఎం ధన్యవాదాలు

'స్త్రీ శక్తి' పథకం అమలుపై ముఖ్యమంత్రి ఆరా తీయగా, ఇది అద్భుతమైన విజయం సాధించిందని అధికారులు తెలిపారు. పథకం ప్రారంభానికి ముందు ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో 68 నుంచి 70 శాతం మధ్య ఉండేదని, ఇప్పుడు రాష్ట్రంలోని 60 డిపోల పరిధిలో బస్సులు 100 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయని వివరించారు. మహిళా ప్రయాణికుల సంఖ్య 40 శాతం నుంచి ఏకంగా 65 శాతానికి పెరిగిందని గణాంకాలతో సహా తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్ర మహిళలు ఎంతో చైతన్యవంతులని, ప్రభుత్వ పథకాలను బాధ్యతాయుతంగా సద్వినియోగం చేసుకుంటున్నారని ప్రశంసించారు.

"రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని, అవసరమైతేనే ప్రయాణాలు చేస్తూ మహిళలు ప్రభుత్వానికి సహకరిస్తున్నారు. వారి సహకారంతోనే ఈ పథకం ఇంత పెద్ద విజయం సాధించింది. వారందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని అన్నారు.

గతంలో డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తే, ఇప్పుడు స్త్రీ శక్తి ద్వారా వారికి ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చామని పేర్కొన్నారు. ఈ పథకం వల్ల విద్యార్థినులు, మహిళలకు బస్ పాసుల కోసం క్యూ లైన్లలో నిలబడే శ్రమ తప్పిందని, ఆర్టీసీలో సురక్షితమైన ప్రయాణం అందుబాటులోకి వచ్చిందని చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. సమీక్షలో భాగంగా ఆర్టిక్యులేటెడ్ ఈబస్సుల గురించి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.



# బొప్పాయితో బోలెడు లాభాలు !

బొప్పాయి పండు ఎంతో ఆరోగ్యకరమైనదని.. పోషకాల గని అని ఆహార నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళలు 30 దాటాక ఈ పండును కచ్చితంగా తీసుకోవాలంటున్నారు. బొప్పాయిలో ఎటువంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయో ఈ కథనంలో తెలుసుకుందాం..



### సీ విటమిన్ పుష్కలం..!

బొప్పాయిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఈ విటమిన్ గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. బొప్పాయిలో ఫోలేట్, విటమిన్ ఎ, ఫైబర్, కాపర్, మెగ్నీషియం, పొటాషియం పుష్కలంగా లభిస్తాయి, ఇవి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.


### గుండెకు మంచిది..!

బొప్పాయిలో విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ వంటి యాంటీ ఆక్సిడెంట్లు అధిక మొత్తంలో ఉంటాయి. యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఈ పండు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి.
అసిడిటీ ప్రాబ్లం ఉన్నోళ్లకు కూడా..!
జీర్ణ సంబంధిత వ్యాధులతో బాధపడేవాళ్లకు సైతం బొప్పాయి ఎంతో మేలు చేస్తుంది.
జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది:
బొప్పాయిలో ఉండే ఎంజైమ్‌లు మెరుగైన జీర్ణక్రియ కారణంగా జీర్ణక్రియకు సహాయపడతాయి.

రోగనిరోధక శక్తిని పెంచుతుంది: విటమిన్ సి పుష్కలంగా ఉన్న ఈ పండును తినడం వల్ల మీ రోగనిరోధక శక్తి పెరుగుతుంది, బాక్టీరియా , వైరల్ వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని శరీరం చేస్తుంది. బొప్పాయి విటమిన్ ఎ, విటమిన్ సి అధికంగా ఉన్న పండు., ఇది మీ రోగనిరోధక శక్తిని వేగంగా పెంచుతుంది.


### వెయిట్ లాస్ కోసం కూడా..!

బరువు తగ్గాలనుకునే మహిళలకు బొప్పాయి చాలా మేలు చేస్తుంది. ఇందులో ఎక్కువ ఫైబర్ , తక్కువ కేలరీలు ఉంటాయి. అటువంటి పరిస్థితిలో, దీన్ని తినడం ద్వారా, మీ కడుపు చాలా సేపటి వరకు నిండినట్లు అనిపిస్తుంది. అంతేకాకుండా దీనిని అతిగా తినకూడదు, బరువు తగ్గడం సులభం అవుతుంది. ఇక స్త్రీల చర్మం 30 ఏళ్ల తర్వాత వదులుగా మారడం ప్రారంభమవుతుంది, అలాంటి పరిస్థితుల్లో మహిళలు తమ ఆహారంలో బొప్పాయిని తీసుకోవాలి. విటమిన్ సి, విటమిన్ ఇ, బీటా కెరోటిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్న ఈ పండు ముడతలు రాకుండా చేస్తుంది.



# ఇవి తిన్నారంటే మీ లివర్ ఖతమ్..!

కేవలం మద్యపానం, ధూమపానం చేసేవాళ్లకు మాత్రమే లివర్ డ్యామేజ్ అవుతుందని చాలా మందిలో ఓ నిశ్చితాభిప్రాయం ఉంటుంది. కానీ కొన్ని రకాల ఫుడ్స్ కూడా లివర్ ను డ్యామేజ్ చేస్తాయట. లివర్ అనేది మన శరీరంలో ఎంతో కీలకమైన ఆర్గాన్. కాబట్టి దీన్ని కాపాడుకోవడం అత్యవసరం. మరి లివర్ పాడవ్వకుండా ఉండాలంటే ఇటువంటి ఫుడ్ కు దూరంగా ఉండాలని చెబుతున్నారు నిపుణులు. లివర్ లో ఉన్న గొప్ప లక్షణం ఏమిటంటే.. మూడు వంతులు పాడైపోయినా మళ్లీ దానంతట అదే బాగవుతుంది. కానీ మొత్తం పాడైపోతే మనల్ని ఎవరూ కాపాడలేరు.. కాబట్టి లివర్ ను కాపాడుకోవాలి. లివర్ బాగుండాలంటే ఈ కింది ఫుడ్స్ కు దూరంగా ఉండండి.





### చక్కెర, మైదా పదార్థాలు

చక్కెర ఎక్కువగా తీసుకుంటే ఆరోగ్యానికి హానికరం. ఎందుకంటే ఇందులో కొవ్వులు ఎక్కువగా ఉంటాయి. బేకరీ ఫుడ్స్, వైట్ బ్రెడ్, వైట్ రైస్, పేస్ట్రీలు, పాస్తా, స్వీట్లు ఇవన్నీ కూడా మైదాతో తయారు చేస్తారు. మైదాలో జీరో కార్బ్, ప్రొటీన్స్ ఉంటాయి. కాబట్టి ఇవి మన ఆరోగ్యానికి మంచివి కావు.

### పిండిపదార్థాలు

కార్బోహైడ్రేట్లు కూడా ఎక్కువ మోతాదులో తీసుకోకూడదు. ఇవి కాలేయాన్ని డ్యామెజ్ చేస్తాయి. దీని వల్ల ఫ్యాటీ లివర్ గా మారుతుందని వైద్యులు చెబుతున్నారు.

### రెడ్ మీట్, ప్రాసెస్ చేసిన ఫుడ్స్ :

మనలో చాలా మంది జంగ్ ఫుడ్, ప్రాసెస్ చేసిన ఫుడ్స్, రెడ్ మీట్ ఎక్కువగా తినే అలవాటు ఉంటుంది. రసాయనాలతో తయారు చేసిన ప్రాసెస్ ఫుడ్ కాలేయానికి హాని కలిగిస్తుంది.

### కూల్ డ్రింక్స్:

శీతలపానీయాలు అత్యంత డేంజరస్ అని వైద్యు చెబుతున్నారు. వీటిని తాగితే లివర్ తొందరగా పాడైతుందని అంటున్నారు. చక్కెర, తీపి పదార్థాలు ఎక్కువగా తినడం వల్ల కాలేయానికి మంచిది కాదని ఇదంతా లివర్ లో పేరుకుపోయి కొవ్వుగా మారుతుందని చెబుతున్నారు. ఫలితంగా కాలేయం పనితీరు దెబ్బతీస్తుంది. ఉప్పు కూడా ఎక్కువగా తీసుకుంటే కాలేయం ప్రమాదంలో పడుతుందని హెచ్చరిస్తున్నారు






# కొండలెక్కండి.. కేలరీలు కరిగించుకోండి..!



నడక ఎంత మంచిదో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రస్తుత ఉరుకులు, పరుగుల జీవితంలో నడక అందరికీ అత్యవసరం. అయితే నడకలో కూడా అనేక రకాలు ఉన్నాయి. ఎలా నడిస్తే మన ఆరోగ్యం బాగుంటుంది? బరువు తొందరగా తగ్గుతాం? అన్న విషయాలపై నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు.

### హంసనడక.. నత్తనడక పనికిరాదు..!

చాలా మంది వాకింగ్ చేస్తున్నామంటూ చిన్నగా నడుస్తూ ఉంటారు. ఇటువంటి హంసనడకల వల్ల పెద్దగా ఉపయోగం ఉండదని నిపుణులు సూచిస్తున్నారు. గంటకు కనీసం 5 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో నడవాలని సూచిస్తున్నారు. నడక వేగం పెరిగితేనే గుండె వేగం పెరిగి శక్తి ఖర్చు అవుతుందట. ఇది క్యాలరీలు బర్నింగ్‌ను పెంచుతుంది. చదునైన ఉపరితలంపై నడవడం కంటే వాలుపై నడవడానికి ఎక్కువ శక్తి అవసరం. కొండలు, గుట్టలు ఎక్కడం వల్ల ఎక్కువ కేలరీలు కరిగించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. వయసు పెరిగే కొద్దీ జీవక్రియ మందగిస్తుంది. ఫలితంగా, టీనేజర్లు పెద్దల కంటే ఎక్కువ కేలరీలు బర్న్ చేస్తారు. ఆడవారితో పోలిస్తే మగవారు కండరాలు బలంగా ఉండటం కారణంగా ఎక్కువ కేలరీలు బర్న్ చేస్తారు. ఫిట్ వ్యక్తులు తక్కువ కేలరీలు ఖర్చు చేస్తారు. వారి శరీరం మరింత సమర్థవంతంగా మారుతుంది. ఫిట్‌నెస్ లేని వ్యక్తులు ఎక్కువ కేలరీలు ఖర్చు చేస్తారు. ఎందుకంటే వారు కష్టపడి పనిచేయాలి. శరీర బరువును బట్టి కేలరీలు ఏవిధంగా ఖర్చవుతాయి. 55 కిలోల బరువున్న వ్యక్తి గంటకు 5 కి.మీ వేగంతో నడిచినట్లయితే, అతను కిలోమీటరుకు 50 నుండి 60 కేలరీలు బర్న్ చేసే అవకాశం ఉంటుంది. కానీ, నిర్దిష్ట సంఖ్య వేగం, స్థానాన్ని బట్టి మారుతుంది. 70 కిలోల బరువున్న వ్యక్తి కిలోమీటరుకు 60 నుండి 75 కేలరీలు బర్న్ చేస్తాడు. చదునైన నేలపై మితంగా నడవడం తక్కువ, ఎత్తైన ప్రదేశంలో నడవడం కంటే ఎక్కువ కేలరీలను బర్న్ చేస్తుంది. 90 కిలోల బరువున్న వ్యక్తి ఒక కిలోమీటర్ నడవడం ద్వారా 80 నుండి 100 కేలరీలు బర్న్ చేయవచ్చు.



# అనుష్క హోటల్ ముందు 1500 మంది పడిగాపులు కాసేవాళ్ళు !

అనుష్క షెట్టి క్రేజ్ గురించి ఘాటి నిర్మాత రాజీవ్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు!
క్రిష్ దర్శకత్వంలో ఘాటి సినిమా సెప్టెంబర్ 5న గ్రాండ్ రిలీజ్!
ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో షూటింగ్‌లో అనుష్క ఫ్యాన్ ఫాలోయింగ్‌ను చూసి ఆశ్చర్యపోయిన టీమ్!

అనుష్క క్రేజ్ గురించి ఘాటి సినిమా నిర్మాత రాజీవ్ రెడ్డి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. అనుష్క ప్రధాన పాత్రలో, క్రిష్ దర్శకత్వంలో రూపొందిన ఘాటి సినిమా సెప్టెంబర్ 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఈ క్రమంలోనే ఒక పక్క దర్శకుడు తో పాటు, మరోపక్క నిర్మాతలు కూడా గట్టిగానే సినిమాని ప్రమోట్ చేస్తున్నారు. తాజాగా నిర్మాతలలో ఒకరైన రాజీవ్ రెడ్డి హైదరాబాదులో ప్రింట్ అండ్ వెబ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన అనుష్క క్రేజ్ గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ, సినిమా మొదలు పెట్టే సమయంలో అనుష్క క్రేజ్ గురించి మేము పెద్దగా ఆలోచించలేదు, కానీ ఎప్పుడైతే సినిమా షూటింగ్ మొదలు పెట్టామో, అప్పుడే మాకు ఈ సినిమా స్పాన్ ఏంటో అర్థం అయిపోయింది అంటూ కామెంట్ చేశారు.

ఆయన మాట్లాడుతూ, ఈ సినిమా షూటింగ్ ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లోని మారుమూల కొండ ప్రాంతాలలో చేశామని, అక్కడ తమకు ఆసక్తికరమైన అనుభవాలు ఎదురయ్యాయని చెప్పుకొచ్చాడు. ఆయన మాట్లాడుతూ, అనుష్క షూటింగ్ కోసం వచ్చి స్టే చేసిన హోటల్ బయట వెయ్యి మంది ఉదయాన్నే పోగై ఉండేవారు. సాయంత్రం సినిమా షూటింగ్ ముగించుకుని వచ్చే సమయానికి 1000 నుంచి 1500 మంది వరకు పోగయ్యి, అనుష్కను చూసేందుకు ఆసక్తి కనబరుస్తూ ఉండేవారు. ఇదంతా నేను చెప్పేది ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని ఒక రిమోట్ గ్రామం సంగతి. అక్కడే పరిస్థితి ఇలా ఉంటే, ఇంకా వేరే ప్రాంతాలలో ఆమెకున్న క్రేజ్ ఎలాంటిదో మీరు అర్థం చేసుకోవచ్చు అంటూ రాజీవ్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఇక రాజీవ్ రెడ్డి స్వయంగా డైరెక్టర్ క్రిష్‌కి స్నేహితుడు. క్రిష్‌తో కలిసి ఆయన వరుస సినిమాలు చేస్తూ వస్తున్నారు. గమ్యంతో మొదలుపెట్టి ఘాటి వరకు ఆయన క్రిష్‌తోనే ప్రయాణం చేస్తున్నారు.

# కథను మైథలాజికల్ జానర్‌ను యాడ్ చేసి చెప్పడమే కొత్త






స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పణలో వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద విజయ్ పాల్ రెడ్డి అడిదల నిర్మించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించిన ఈ మూవీలో సత్య రాజ్, ఉదయభాను, వశిష్ట ఎన్ సింహా, సత్యం రాజేష్, క్రాంతి కిరణ్, సాంచీ రాయ్ వంటి వారు ప్రముఖ పాత్రలను పోషించారు. ఈ సినిమా ఆగస్ట్ 29న ఆడియెన్స్ ముందుకు రానుంది. ఈ క్రమంలో రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్‌లు ఇప్పటికే ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఈ మేరకు నిర్మాత విజయ్ పాల్ రెడ్డి అడిదల చిత్ర విశేషాల్ని పంచుకున్నారు. 'త్రిబాణధారి బార్బరిక్' ప్రయాణం మొదలైంది. నేను నా వ్యాపారాలతో బిజీగా ఉండేవాడిని. ఓ సారి ఈ కథను విన్నాను. మోహన్ గారు చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. ముందుగా చిన్న బడ్జెట్‌తో మూవీని తీయాలని అనుకున్నాం. ఆ తరువాత మారుతి గారిని కలిశాను. తీస్తే సినిమా బాగా తీయండి.. లేదంటే లేదు అని ఆయన అన్నారు. దీంతో భారీ ఎత్తున ఈ మూవీని తీయాలని ఫిక్స్ అయ్యాను. 'త్రిబాణధారి బార్బరిక్' కొత్త రకమైన కథ. చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. మలయాళంలో తీసినట్టుగా చాలా సహజంగా తీశాం.

తెలుగు ఆడియెన్స్‌కు కావాల్సిన కమర్షియల్ అంశాల్ని కూడా జోడించాం. ముందుగా ఈ కథను చిన్న స్థాయిలో తీయాలని అనుకున్నా కూడా కథ డిమాండ్ మేరకు భారీగా నిర్మించాం. ఈ కథను మైథలాజికల్ జానర్‌ను యాడ్ చేసి చెప్పడమే కొత్తగా ఉంటుంది. వరంగల్, విజయవాడలో ప్రీమియర్లు వేశాం. అక్కడ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. సినిమాను చూసిన వారిలో చాలా మంది కన్నీళ్లు పెట్టుకున్నారు. మూవీ అద్భుతంగా ఉందని అందరూ పొగిడారు. మాకు అదే చాలా సంతృప్తినిచ్చింది. ఆడియెన్స్ ప్రస్తుతం కొత్త కంటెంట్, డిఫరెంట్ కాన్సెప్ట్‌లనే ఆదరిస్తున్నారు. నేను ఈ ఇండస్ట్రీకి కొత్త. మాకు మారుతి గారు అండగా నిలిచారు. కథతో పాటు టెక్నికల్ పరంగానూ చాలా కొత్తగా ఉంటుంది.



# రాత్రులు అలా చేస్తుంటాను..

స్టార్ హీరోయిన్ శ్రీలీలా ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేసి సెన్సేషన్‌గా మారింది. వరుస హిట్స్‌తో తన కంటూ మంచి మార్కెట్ సంపాదించుకుని, త్వరలో బాలీవుడ్‌లోకి కూడా ఎంట్రీ ఇవ్వనుంది. తన తొలి హిందీ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ క్రమంలో, టాలీవుడ్, బాలీవుడ్ ప్రాజెక్ట్స్ పూర్తి చేసుకోవడంలో బిజీగా ఉన్నప్పటికీ, శ్రీలీలా సమయాన్ని వాడుకొని ఇంటర్వ్యూలకు హాజరవుతుంది. తాజాగా, సీనియర్ నటుడు జగపతి బాబు హోస్ట్‌గా ప్రారంభమైన 'జయమ్ము నిశ్చయమ్మురా' టాక్ షోలో శ్రీ లీలా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన తల్లి స్వర్ణలత గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యింది.

జగపతి బాబు ఆమెను ప్రశ్నించారు: "ఇండస్ట్రీలో ఒక కంప్లైంట్ ఉంది. ప్రతిదానికి 'అమ్మా అమ్మా' అని అడుగుతావా? ఏది చేయాలన్నా ముందుగా అమ్మని అడగాలనే అలవాటు ఉందా?" ఈ ప్రశ్నకు శ్రీలీలా ఇలా సమాధానం ఇస్తూ.. 'నా జీవితంలోని ప్రతి నిర్ణయం అమ్మ దగ్గరే ఉంటుంది. 6 నెలల క్రితం వరకు, మా అమ్మ లేకుండా రాత్రి నిద్రపోయే దాన్ని కాదు. రాత్రిలో తప్పనిసరిగా అమ్మ పక్కన ఉండాలి. లేకపోతే మేల్కొన్ని వణికిపోతాను. అమ్మ నన్ను పట్టుకొని నార్మల్ చేస్తుంది. షూట్స్‌కు వెళ్ళినా అమ్మ ఉండాల్సిందే. ఆమె లేకుంటే ఉండటం కష్టం. అమ్మకు చెప్పకుండా ఏ పని చేయను' అంటూ తన తల్లిపై తన ప్రేమను మరింత వివరించారు. ప్రజంట్ ఈ మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# మరో వెబ్‌సిరీస్‌లో తమన్నా.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?



ఓటీటీ ప్రేక్షకులకూ చేరువైన ప్రముఖ నటి తమన్నా. ఇప్పటికే పలు వెబ్‌సిరీస్‌లతో అలరించిన ఆమె మరో సిరీస్‌లో నటించారు. అదే.. 'డు యూ వనా పార్ట్‌నర్'. ప్రముఖ ఓటీటీ 'అమెజాన్ ప్రైమ్ వీడియో' (Amazon Prime Video) ఒరిజినల్ సిరీస్‌గా ఇది రూపొందింది. విడుదల తేదీ సోమవారం ఖరారైంది. ఆ ఓటీటీలో సెప్టెంబరు 12 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ కామెడీ డ్రామా వెబ్‌సిరీస్‌లో బాలీవుడ్ నటి డయానా పెంటీ (Diana Penty) మరో కీలకపాత్ర పోషించారు. కాలిన్, అర్చిత్‌కుమార్ సంయుక్త దర్శకత్వంలో ఈ సిరీస్ రూపొందింది. ఇద్దరు యువతుల స్నేహం, వారు ఎదుర్కొన్న సవాళ్లు తదితర అంశాలను ఈ సిరీస్‌లో చూపించనున్నారు. 'ఓదెల 2'తో ఇటీవల ప్రేక్షకులను పలకరించారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఆమెకు వరుస అవకాశాలొస్తున్నాయి. షాహిద్ కపూర్ హీరోగా తెరకెక్కనున్న 'రోమియో'లో ఆమె కీలక పాత్ర పోషించనున్నట్టు సమాచారం. 'రాగిణి ఎమ్ఎమ్ఎస్' ఫ్రాంచైజీలో తెరకెక్కనున్న మూడో సినిమాలో తమన్నా హీరోయిన్‌గా ఎంపికయ్యారని తెలిసింది. అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: GATTIMI SATISH KUMAR, RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465